# సింగరేణి సమస్యలు పరిష్కరించాలి



- నాణ్యమైన యంత్రాలను సమకూర్చాలి
- బాయిబాట కార్యక్రమానికి శ్రీధర్ బాబు ఆటంకాలు
- టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత విమర్శలు

పెద్దపల్లి : 'బాయి బాట' కార్యక్రమం చేపడితే రాజకీయంగా తమను అడ్డుకోవాలని మంత్రి శ్రీధర్‌బాబు పోలీసులను ఏర్పాటు చేశారని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత ఆరోపించారు. ఎంత అడ్డుకుంటే అంత బలంగా ముందుకు సాగుతామన్నారు. బాయిబాట కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టును కవిత సందర్శించారు. కార్మికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. 2లో


# ది క్రైమ్ న్యూస్

Crime News

తెలుగు దినపత్రిక

శనివారం, జూన్ 20, 2026 | సంపుటి - 20 | సంచిక 267 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.




## మూసీ రివర్‌ఫ్రంట్‌కు
# కేంద్రం గ్రీన్ సిగ్నల్

### అనుమతులు ఇస్తూ రక్షణశాఖ ఉత్తర్వులు జారీ

### రూ.533.42 కోట్ల విలువైన 83.81 ఎకరాల డిఫెన్స్ భూమి అప్పగింత

- అనుమతులపై సిఎం రేవంత్ రెడ్డి హర్షం
- కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు కృతజ్ఞతలు

హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి కీలక ముందడుగు పడింది. గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ అమలుకు కేంద్రం నుంచి అధికారిక అనుమతి లభించింది. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్‌కు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బాపూఘాట్‌ను 'గాంధీ సరోవర్'గా అభివృద్ధి చేయడానికి వర్కింగ్ పర్మిషన్‌ను మంజూరు చేసింది. రూ.533.42 కోట్ల విలువైన 83.81 ఎకరాల డిఫెన్స్ భూమి వినియోగానికి అనుమతిచ్చింది. ఆర్టిలరీ సెంటర్ గోల్కొండ పరిధిలోని భూమిలో అభివృద్ధి పనులకు కేంద్రం క్లియరెన్స్ ఇచ్చింది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్ట్‌కు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ నుండి కీలక అనుమతులు లభించాయి. హైదరాబాద్‌లోని బాపు ఘాట్ వద్ద నిర్మించతలపెట్టిన గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ పనులకు రక్షణ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.



తరువాయి 2లో

## కేంద్రం నిర్ణయం మేరకే కొంటే మీరెందుకు ?



- కాంగ్రెస్‌ది రైతు వ్యతిరేక విశ్వాస ఘాతక ప్రభుత్వం
- రాహుల్ జన్మదినం రోజే రైతు డిక్లరేషన్‌కు చెల్లుచీటీ
- రైతులపై విషం కక్కిన సిఎం రేవంత్ రెడ్డి
- రెండు బస్తాల యూరియాతో మిర్చి రైతులు ఏం కాను
- మీడియా సమావేశంలో ప్రభుత్వంపై హరీష్ విమర్శలు



## మైనర్ల డ్రైవింగ్‌ను క్షమించేది లేదు

- స్కూల్ పిల్ల భద్రతపై యాజమాన్యాలదే బాధ్యత
- స్కూల్ యాజమాన్యాలతో భేటీఓ సిపి సజ్జనార్

హైదరాబాద్ : మైనర్లు డ్రైవింగ్ చేస్తే అస్సలు క్షమించమని హైదరాబాద్ సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో 'స్కూల్ పిల్లల భద్రత'పై స్కూల్ యాజమాన్యాలు, సంబంధిత శాఖలతో ట్రాఫిక్ పోలీసులు సమావేశం నిర్వహించారు. తరువాయి 2లో



## 20ప్రాంతాల్లో ఆధునిక
# ధాన్య సైలోలు

### ధాన్యం నిల్వ వ్యవస్థ ఆధునీకరణకు చర్యలు

### ప్రస్తుత కొనుగోలు వ్యవస్థ కొనసాగుతుంది.

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్ : రాష్ట్రంలో ధాన్యం నిల్వ వ్యవస్థను మరింత శాస్త్రీయంగా, ఆధునికంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రధాన వరి ఉత్పత్తి జిల్లాల్లో 20 ప్రాంతాల్లో అత్యాధునిక సైలోల ఏర్పాటుపై ప్రభుత్వం పరిశీలన చేస్తున్నట్లు వెల్లడించారు. 2లో

## పాఠశాలల్లోనే
# దేశ భవిష్యత్

- నాణ్యమైన విద్యతో పాటు వసతి సౌకర్యాలు
- తెలంగాణలో విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులు
- ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి
- విద్యార్థులకు యంగ్ ఇండియా స్కూల్ కిట్స్ అందచేత
- విద్యామంత్రిగా తానే నిరంతర పర్యవేక్షణ
- ఎల్బీ స్టేడియం కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్ : దేశ బవిష్యత్ పాఠశాలల్లోనే ఉందని గ్రహించి, అందుకు అనుగుణంగా తెలంగాణ విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కార్పోరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చి దిద్దుతున్నామని అన్నారు. 2లో

## ఎన్నికల హామీలను
# విస్మరించిన కాంగ్రెస్

- మాఫియా నాయకుడిగా రేవంత్ వ్యవహార శైలి
- కెసిఆర్‌ను తిట్టడమే పనిగా పాలన సాగిస్తున్నారు
- మల్కాజిగిరి కార్యకర్తల సమావేశంలో కెటిఆర్ విమర్శలు



రేవంత్ రెడ్డి అబద్దాలు చెప్పి, మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

హైదరాబాద్ : కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ కొద్ది రోజుల్లోనే ప్రజలు పడు తున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ, ప్రభుత్వాన్ని ఒక మాఫియాతో పోల్చారు. ప్రభుత్వం ఏర్పడి ఇన్ని రోజులవుతున్నా ఇచ్చిన గ్యారంటీల ఊసే లేదు. దీనిపై ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తే అడ్డమైన తిట్లు తిడుతున్నారు. వంద రోజుల్లో పిల్లలు పుడతారా అంటూ వింత మాటలు 2లో




# భూవివాదాలు లేని తెలంగాణ నిర్మాణమే లక్ష్యం

- భూవివాదాలు లేని తెలంగాణ నిర్మాణమే లక్ష్యం
- రాష్ట్రంలో దశల వారీగా భూముల రీసర్వే
- వచ్చేనెల నుంచి తొలిదశలో 2240 గ్రామాల్లో ప్రారంభం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

2లో

## నేడు అన్నదాత
# సుఖీభవ నిధుల విడుదల



### రూ.3,125 కోట్లు పంపిణీకి రంగం సిద్ధం

### 46.85 లక్షల మంది రైతు కుటుంబాలకు లబ్ధి

### లింగంగుట్లలో అందచేయనున్న సిఎం చంద్రబాబు

అమరావతి : రాష్ట్రంలోని రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు అన్నదాత సుఖీభవ నిధులను ఎపి ప్రభుత్వం నేడు విడుదల చేయనుంది. శనివారం పల్నాడు జిల్లా చిలకలూరి పేట నియోజకవర్గంలోని లింగం గుంట్లలో జరిగే కార్యక్రమంలో ఈ నిధులను సీఎం చంద్రబాబు నాయుడు విడుదల చేయనున్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో తొలి విడత నగదును అన్నదాతల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనుంది. అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ ద్వారా ఈ ఏడాది తొలి విడతగా రూ.3,125 కోట్లు పంపిణీ చేయనున్నారు. ఈ నగదు ద్వారా 46.85 లక్షల మంది రైతు కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. వైపు శనివారం ప్రధాన మంత్రి కిసాన్ యోజన పథకం కింద నిధులను విడుదల చేస్తోంది. పశ్చిమ బెంగాల్ హుగ్లీ జిల్లాలోని తారకేశ్వర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోదీ ఈ నిధులను విడుదల చేయనున్నారు. దీంతో ఒక్కో రైతు ఖాతాలో రూ. 2 వేలు చొప్పున నగదు జమ కానుంది. 2లో



## హైదరాబాద్‌లో
# జనసేన పార్టీ కార్యాలయం

### మణికొండ మల్కం చెరువు సమీపంలో కొత్త ఆఫీస్

### జెండా ఎగురేసి ప్రారంభించిన జనసేనాని పవన్ కళ్యాణ్

హైదరాబాద్ : హైదరాబాద్‌లో జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం అయ్యింది. పార్టీ అధినేత, ఎపి డిప్యూటి సిఎం÷- పవన్ కళ్యాణ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. హైదరాబాద్‌లోని మణికొండ మల్కం చెరువు సమీపంలో నూతనంగా నిర్మించిన జనసేన తెలంగాణ రాష్ట్ర కార్యాలయం శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలతో అధికారికంగా ప్రారంభమైంది.

తరువాయి 2లో

# సింగరేణి సమస్యలు పరిష్కరించాలి

అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టులో ఉద్యోగులకు సౌకర్యాలు, సరైన యంత్రాలు, పనిముట్లు ఏర్పాటు చేయాలని కోరారు. సింగరేణి కార్మికులకు ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీలన్నీ వెంటనే నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సింగరేణిలో క్వాలిటీ యంత్రాలు లేవు.. వారి భద్రతను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కల్వకుంట్ల కవిత అన్నారు. సింగరేణి కార్మికుల సమస్యలు, స్థానిక మంత్రి శ్రీధర్ బాబు వైఖరిని ఎండగడుతూ ఆమె వ్యాఖ్యలు చేశారు. అదే సమయంలో మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావుపై ఆమె చేసిన వ్యాఖ్యలు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. సింగరేణి కార్మికుల క్షేమమే తమకు ముఖ్యమని స్పష్టం చేసిన కవిత.. ప్రస్తుతం సింగరేణిలో కార్మికులకు కనీస నాణ్యత కలిగిన యంత్రాలు అందుబాటులో లేవని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాణాలను పణంగా పెట్టి పనిచేసే బొగ్గు గని కార్మికుల భద్రతను ప్రస్తుత ప్రభుత్వం గాలికొదిలేసిందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో సింగరేణి కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డిని హరీష్ రావే కాపాడుతున్నారు సంచలన వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు.. స్థానిక మంత్రి శ్రీధర్ బాబు వైఖరిని తీవ్రంగా తప్పుబట్టారు. తాము సింగరేణి ప్రాంతాల్లో పర్యటిస్తుంటే మంత్రి శ్రీధర్ బాబు కావాలనే తమ పర్యటనలను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లకుండా అడ్డుకుంటూ, ఈ వ్యవహారం ద్వారా శ్రీధర్ బాబు రాజకీయంగా లబ్ది పొందాలని చూస్తున్నారని విమర్శించారు.

# మైనర్ల డ్రైవింగ్‌ను క్షమించేది లేదు

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సిటీ పరిధిలో 3500లకు పైగా స్కూల్స్ ఉన్నాయని, వీటిలో 12 లక్షలకు పైగా విద్యార్థులు చదువుతున్నారని అన్నారు. సేఫ్ స్కూల్ ఎన్విరాన్మెంట్ క్రియేట్ చేయడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్ పాటించడం అన్నది అలవాటుగా మారాలని సూచించారు. విద్యాసంస్థల్లో ర్యాంక్స్ ఇంపార్టెంట్ కాదని.. సేఫ్ ఎన్విరాన్మెంట్ ముఖ్యమని సీపీ స్పష్టం చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో స్కూల్ బస్సు డ్రైవర్లు పట్టుబడుతున్నారని తెలిపారు. విద్యార్థులు స్కూల్‌కు ఏ విధంగా వస్తున్నారనే దానిపై స్కూల్ యాజమాన్యం వద్ద పూర్తి రూట్‌మ్యాప్ ఉండాలన్నారు. పిల్లలు పాఠశాలకు వస్తున్నారంటే.. ఏం జరిగినా స్కూల్ యాజమాన్యానిదే బాధ్యత అని తేల్చిచెప్పారు. స్కూల్ బస్సులను నడిపే డ్రైవర్స్‌పై నిఘా ఉంచాలని సీపీ సూచించారు. ట్రాఫిక్ వాలంటీర్లు, మార్షల్స్‌ను విద్యాసంస్థలు నియమించుకోవాలని అన్నారు. పిల్లలు తెలిసీ తెలియక నేరాల్లో ఇన్వాల్వ్ అవుతున్నారని.. పిల్లలపై టీచర్స్, పేరెంట్స్ పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. స్కూల్ పరిసరాల్లో ఖచ్చితంగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. స్కూల్ పరిసరాల్లో పొగాకు ఉత్పత్తులు అమ్మడం నేరమని... అలాంటి వాటిపై పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. దేశవ్యాప్తంగా ప్రతిరోజు 45 మంది విద్యార్థులు యాక్సిడెంట్లో చనిపోతున్నారని, యాక్సిడెంట్లు మర్డర్ల కంటే ప్రమాదకరమన్నారు. అందుకే స్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించాలని సీపీ సజ్జనార్ వెల్లడించారు.

# 20 ప్రాంతాల్లో ఆధునిక ధాన్య సైలోలు

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో శుక్రవారం ధాన్య నిల్వ, రవాణా రంగానికి చెందిన ప్రముఖ సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో వరి ఉత్పత్తి, ధాన్యం కొనుగోళ్లు ప్రతి ఏడాది పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిల్వ సామర్థ్యాలను కూడా పెంచాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. అందులో భాగంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సైలోల ఏర్పాటును ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. ప్రారంభ దశలో 50 వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యంతో సైలోల నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసే అవకాశాలను అధ్యయనం చేస్తున్నామని చెప్పారు. సైలోలు ప్రస్తుతం అమలులో ఉన్న ధాన్యం కొనుగోలు, నిల్వ వ్యవస్థలకు ప్రత్యామ్నాయం కాదని, వాటికి అనుబంధంగా పనిచేసే ఆధునిక మౌలిక వసతులుగా ఉపయోగపడతాయని స్పష్టం చేశారు. ’తెలంగాణలో రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లలో స్వయం సహాయక సంఘాలు, ఐకేపీ కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. భవిష్యత్తులో కూడా వారి పాత్ర కొనసాగుతుంది. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రస్తుత కొనుగోలు వ్యవస్థను కొనసాగిస్తూనే ఆధునిక సాంకేతికతను అనుసంధానం చేస్తాం’ అని మంత్రి తెలిపారు. పంట కోతల అనంతరం నిల్వ నష్టాలను తగ్గించడం, ధాన్యం నాణ్యతను పరిరక్షించడం, రవాణా వ్యవస్థను వేగవంతం చేయడం, సరఫరా గొలుసును మరింత సమర్థవంతంగా మార్చడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఆయన చెప్పారు. సమావేశంలో పాల్గొన్న సాంకేతిక నిపుణులు ఆధునిక సైలోల ద్వారా ధాన్యం స్వీకరణ నుంచి నిల్వ, రవాణా వరకు మొత్తం ప్రక్రియను ఆటోమేటెడ్ పద్ధతిలో నిర్వహించవచ్చని వివరించారు. డిజిటల్ నాణ్యత పరీక్షలు, యాంత్రిక అన్‌లోడింగ్, సెన్సార్ ఆధారిత పర్యవేక్షణ, శాస్త్రీయ నిల్వ విధానాల ద్వారా ధాన్య నాణ్యతను దీర్ఘకాలం కాపాడవచ్చని తెలిపారు. ÷-రస్తుతం కొనుగోలు కేంద్రాలు, నిల్వ కేంద్రాల వద్ద ఎదురవుతున్న కార్మికుల కొరత, రవాణా ఆలస్యం వంటి సమస్యలకు కూడా ఈ వ్యవస్థ సమర్థవంతమైన పరిష్కారం చూపగలదని మంత్రి అభిప్రాయపడ్డారు. ల్గ÷ల్వే అనుసంధానంతో కూడిన ఆధునిక లాజిస్టిక్స్ వ్యవస్థ ద్వారా ధాన్యాన్ని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు, దేశవ్యాప్తంగా వినియోగ కేంద్రాలకు వేగంగా తరలించే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రధాన వరి ఉత్పత్తి జిల్లాల్లో సైలోల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలు, నిల్వ సామర్థ్యాలు, పెట్టుబడి వ్యయం, అమలు విధానాలపై సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని మంత్రి సంబంధిత సంస్థలను ఆదేశించారు. ’ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా, పంపిణీ వ్యవస్థలను మరింత బలోపేతం చేసి రైతులకు, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడం ప్రభుత్వ లక్ష్యంగా సాంకేతికతను వినియోగిస్తూ వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతాం’ అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

# గండిపేట భూకబ్జా కేసు

## షరతులతో బ్రహ్మానాయుడికి బెయిల్

హైదరాబాద్,జూన్19 : గండిపేట భూకబ్జా కేసులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడికి బెయిల్ మంజూరు అయ్యింది. ఆయనకు రంగారెడ్డి కోర్టు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. ప్రతి 15 రోజులకు ఒకసారి నార్సింగ్ పోలీస్ స్టేషన్‌లో వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని ఆదేశాలు జారీ చేసింది. రూ.20 వేల చొప్పున రెండు ష్యూరిటీలు సమర్పించాలని రంగారెడ్డి న్యాయస్థానం ఆదేశించింది. ఈ కేసులో సాక్షులను, విచారణను ప్రభావితం చేసే విధంగా ప్రవర్తించవద్దని షరతుల్లో పేర్కొంది. ఫేక్ జీవో కేసులో ఇప్పటికే ఈవోడబ్ల్యూ పోలీసులు మూడు రోజుల పాటు బొల్లా బ్రహ్మానాయుడిని కస్టడీలోకి తీసుకుని విచారించారు. కస్టడీ ముగిసిన తర్వాత ఆయనను జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు. తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ బొల్లా బ్రహ్మానాయుడు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు ముగిసిన అనంతరం మాజీ ఎమ్మెల్యేకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే, కస్టడీలో మాజీ ఎమ్మెల్యే సరైన సమాధానాలు చెప్పలేదని, ఏ ప్రశ్నలు అడిగా తనకు తెలీదని మాత్రమే చెప్పారని, తాము ఆశించిన స్థాయిలో విచారణకు సహకరించలేదంటూ న్యాయస్థానం దృష్టికి పోలీసులు తీసుకెళ్లారు. కస్టడీ పూర్తి అయినందుకు బెయిల్ పొందేందుకు అర్హుడే అంటూ బొల్లా బ్రహ్మానాయుడు తరఫు న్యాయవాదులు వాదించారు.

# మూసీ రివర్‌ఫ్రంట్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

ఈ కీలకమైన క్లియరెన్స్ లభించడం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో సహకరించి, అనుమతులు మంజూరు చేసినందుకు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర రక్షణ శాఖ , ఇండియన్ ఆర్మీకి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మూసీ నది పునరుజ్జీవనం , రివర్‌ఫ్రంట్ అభివృద్ధి విజన్‌లో గాంధీ సరోవర్ ప్రాజెక్ట్‌కు అనుమతులు రావడం ఒక కీలక మైలురాయి అని అభివర్ణించారు. బాపు ఘాట్ పరిసర ప్రాంతాలలో ఈ ప్రాజెక్ట్ పనులు ప్రారంభం కావడం వల్ల మూసీ పరివాహక ప్రాంత రూపురేఖలు మారిపోతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మూసీ నది పరివాహక ప్రాంతాన్ని కేవలం ఒక నదిలా కాకుండా.. అద్భుతమైన పర్యావరణ, సాంస్కృతిక , గొప్ప ప్రజా ఆస్తిగా మార్చడమే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా హైదరాబాద్ నగరానికి ఒక సరికొత్త పర్యాటక హంగులు తోడవుతాయని, పర్యావరణ రక్షణకు కూడా ఇది ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. కేంద్ర రక్షణ శాఖ ఇచ్చిన ఈ గ్రీన్ సిగ్నల్‌తో గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ పనులు మరింత వేగంగా ముందుకు సాగనున్నాయి.మూసీ పునరుజ్జీవం, రివర్ ఫ్రంట్ అభివృద్ధి విజన్‌లో ఇదో మైలురాయన్నారు. మూసీ పరివాహక ప్రాంతాన్ని పర్యావరణ, సాంస్కృతిక, ప్రజా ఆస్తిగా మార్చడమే లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్

మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌ను తిట్టుకుంటూ తిరిగితే చాలు, పాలన చేయనక్కర్లేదు అనే చందాన సీఎం వ్యవహార శైలి ఉందని విమర్శించారు. గత ప్రభుత్వం చేసిన పనులకు రిబ్బన్లు కట్ చేయడానికి సీఎం తన జేబులో కత్తెర పెట్టుకుని తిరుగుతున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర అభివృద్ధి శూన్యమైందని, కేవలం అప్పులే పెరిగిపోయాయని కేటీఆర్ ఆరోపించారు. ఈ కొద్ది కాలంలోనే ప్రభుత్వం దాదాపు 4 లక్షల కోట్ల రూపాయల అప్పు చేసిందని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో పేదలకు ఒక్క ఇల్లు కూడా కట్టి ఇవ్వలేదు గాని, ’హైడ్రా’ పేరుతో ఉన్న ఇళ్లను మాత్రం నిర్దాక్షయంగా కూల్చుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులను ’దండుపాళ్యం ముఠా’తో పోల్చిన ఆయన, ఈ ప్రభుత్వాన్ని ఒక మాఫియా నడుపుతోందని, ఆ మాఫియాలో రేవంత్ రెడ్డి ఒక పిల్ల నాయకుడు అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.రాష్ట్రంలో రైతుల పరిస్థితి మరీ దారుణంగా తయారైందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం దగ్గర గోనెసంచులు కూడా లేవని, ఆ సంచులన్నీ ఢిల్లీకి పోతున్నాయని విమర్శించారు. రైతులకు ఇవ్వాల్సిన ’రైతుబంధు’ డబ్బు బంద్ అయిపోయిందని, ఆ పైసలన్నీ రాహుల్ గాంధీ ఖాతాలో ’టింగ్ టింగ్’ అని పడుతున్నాయని ఆరోపించారు. ప్రస్తుతం పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే, రైతులు ధాన్యం కుప్పలపైనే ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు మంచి, చెడు ఏంటో పూర్తిగా అర్థమైందన్న కేటీఆర్, కేసీఆర్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి ప్రజలంతా కథానాయకులు కావాలని పిలుపునిచ్చారు. మల్కాజ్‌గిరి ప్రజలు , బిఆర్ఎస్ కార్యకర్తలు ఎటువంటి రౌడీలు, గుండాలకు భయపడాల్సిన అవసరం లేదని, పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పరంగా నిలబడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# పాఠశాలల్లోనే దేశ భవిష్యత్

పేదలు ఆత్మన్యూన తకు లోనుకకాకుండా వారి పిల్లలకు కూడా ప్రైవేట్ తరహా విద్యను అందిస్తున్నామని అన్నారు.అందుకోసం విద్యార్థులు ఆత్మగౌరవంతో పాఠశాలకు వెళ్లేందుకు ఎడ్యుకేషన్ కిట్లను పంపిణీ చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విద్యపై నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామని చెప్పారు. అందుకోసం విద్యాశాఖను తానే స్వయంగా నిర్వహిస్తున్నానని చెప్పారు. నగరంలోని ఎల్బీ స్టేడియంలో యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్ల పంపిణీని గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో కలిసి సీఎం ప్రారంభించారు. గురుకుల పాఠశాల విద్యార్థులకు 22 వస్తువులతో కిట్లు అందించారు. వసతి గృహ విద్యార్థులకు 10, పాఠశాల విద్యార్థులకు 7 వస్తువులతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణ భాషా ప్రయుక్తరాష్ట్రంగానో, పాలనా సౌలభ్యం కోసమో ఏర్పడింది కాదని ఈసందర్భంగా అన్నారు. 60 ఏళ్ల సుదీర్ఘ పోరాటం, విద్యార్థుల ఆత్మబలిదానాలతో ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైంది. తెలంగాణ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు, ఉపాధి కోసం ఎంతోమంది త్యాగాలు చేశారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో ఉంది.. వాటిని పునరుద్ధరించాలన్నదే తన సంకల్పమని అన్నారు. విద్యాశాఖను గతంలో విధ్వంసం చేశారు. గత పాలకుల అరాచకంతో రాష్ట్రానికి వందేళ్ల నష్టం జరిగింది. తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ రూపొందించి ప్రక్షాళన చేపట్టాం అని వివరించారు. విధ్వంసమైన విద్యాశాఖను వికాసం వైపు నడిపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం బడ్జెట్‌లో 8.5 శాతం నిధులు కేటాయించాం. వెనుకబడిన తరగతుల విద్యార్థుల కోసం రూ.26,600 కోట్లు ఖర్చు చేస్తున్నాం. వీటిని భావితరాల భవిష్యత్తును నిర్ణయించే పెట్టుబడులుగా భావిస్తున్నాం. ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో నో అడ్మిషన్ బోర్డు పెట్టారు. ప్రభుత్వ స్కూళ్లలో ఇలా బోర్డు పెట్టే పరిస్థితి వస్తుందని ఎవరూ ఊహించి ఉండరని అన్నారు. ఉద్యోగులకు జీతాల మాదిరిగానే ప్రతినెలా ఒకటో తేదీన విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు చెల్లిస్తున్నామని రేవంత్‌రెడ్డి అన్నారు. గతంలో హాస్టల్ విద్యార్థులకు ఈ ఛార్జీలు పెంచలేదని, తాము అధికారంలోకి వచ్చాక పెంచామని అన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్‌తో పాటు మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో జనసేన పార్టీ కార్యాలయం

జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ జనసేన జెండాను ఆవిష్కరించి కార్యాలయంలోకి అడుగుపెట్టారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తెలంగాణ తల్లి చిత్రపటానికి నమస్కరించి, రాష్ట్ర నాయకులతో ముచ్చటించారు. రాబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (ఉఊఓఅ) ఎన్నికల్లో జనసేన పార్టీ బరిలోకి దిగుతుందని పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఒంటరిగానైనా సరే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పోటీ చేస్తామని, క్షేత్రస్థాయిలో పార్టీకి బలం పెంచేందుకు త్వరలోనే తానే స్వయంగా తెలంగాణవ్యాప్తంగా పర్యటిస్తానని ఆయన ప్రకటించారు. ఈ క్రమంలోనే గ్రేటర్ ఎన్నికలను ఒక సవాల్‌గా తీసుకుని క్యాడర్‌ను సమాయత్తం చేసేందుకు ఈ నూతన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా మారిన జనసేన పార్టీ.. తెలంగాణపై తన రాజకీయ దృష్టిని కేంద్రీకరించింది. రాష్ట్రంలో పార్టీ విస్తరణ, సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా సరికొత్త వ్యూహాలతో దూకుడు పెంచింది. హైదరాబాద్‌లో ఇప్పటికే జనసేన పార్టీకి కార్యాలయం ఉన్నప్పటికీ.. తెలంగాణలో పార్టీ ఉనికిని మరింత బలంగా చాటేందుకు ఈ కొత్త ఆఫీస్‌ను అందుబాటులోకి తెచ్చారు. రాష్ట్రంలో పార్టీ చేరికలను ప్రోత్సహించేందుకు వీలుగా త్వరలోనే ఒక ప్రత్యేక ’జాయినింగ్స్ కమిటీ’ని కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యాలయం కేంద్రంగానే తెలంగాణలో సంస్థాగత నిర్మాణం, కమిటీల ఏర్పాటు, ఇతర రాజకీయ వ్యూహాలపై జనసేన నాయకత్వం దృష్టి సారించనుంది.ఇటీవలి కాలంలో పవన్ కళ్యాణ్ హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ పెట్టడం, ఢిల్లీ వేదికగా జరిగిన ’సేన ప్రస్థానం’ కార్యక్రమంలో తెలంగాణ రాజకీయాల గురించి ప్రస్తావించడం, అలాగే హనుమకొండలో తన అభిమాని నిరంజన్‌ను కలవడం వంటి వరుస పరిణామాలు జనసైనికుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ఆంధ్రప్రదేశ్‌లో సాధించిన విజయ ఉత్సాహంతో తెలంగాణలోనూ జనసేనను ఒక బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా నిలబెట్టాలని పవన్ భావిస్తున్నారు. ఈ నూతన కార్యాలయం ప్రారంభోత్సవంతో తెలంగాణ రాజకీయాల్లో జనసేన తన తదుపరి పొలిటికల్ రోడ్ మ్యాప్‌ను ఎలా సిద్ధం చేసుకోబోతోందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# కేంద్రం నిర్ణయం మేరకే కొంటే మీరెందుకు ?



సిద్దిపేట : కేంద్రం కనీస మద్దతు ధర నిర్ణయించిన పంటలను మాత్రమే కొంటామంటే ఇక మీరెందుకని అధికార కాంగ్రెస్ పార్టీ నేతలను బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు సూటిగా ప్రశ్నించారు. పేపర్ లెస్ కేబినెట్ అన్నారని.. కానీ మీది విశ్వాసం లేని కేబినెట్ అని అభివర్ణించారు. మీది విశ్వాఘాతుక ప్రభుత్వమని రేవంత్ రెడ్డి సర్కారుపై నిప్పులు చెరిగారు. పంట కొనుగోలుపై కాంగ్రెస్ సర్కార్ చేతులెత్తేసిందని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదినం నాడు రైతులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విషం కక్కారని మండిపడ్డారు. శుక్రవారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వరంగల్‌లో రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్ ప్రకటించారని గుర్తు చేశారు. ఆయన జన్మదినం రోజే ఆ డిక్లరేషన్‌ను తెలంగాణ సీఎం బొందపెట్టారని హరీశ్ రావు విమర్శించారు. ధాన్యం ఏదైనా కనీస మద్దతు ధరతోపాటు బోనస్ కూడా ఇస్తామని నాడు రాహుల్ గాంధీ వరంగల్ వేదికగా ప్రకటించారని గుర్తు చేశారు. కానీ అందుకు భిన్నంగా కేంద్రం చెప్పిందే కొంటాం.. ఎంత కొనమంటే అంతే కొంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెలిపారు. తన బాధ్యత నుంచి తప్పించుకుంటుందంటూ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం కొన్నా కొనకపోయినా.. అన్ని పంటలు కొన్నది కేసీఆర్ ప్రభుత్వమని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తన నిర్ణయం మార్చుకోవాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. కేంద్రం ఎంఎస్‌పి ప్రకటిస్తుంది తప్ప మక్కలూ, జొన్నలు కొనదా? అని అసహనం వ్యక్తం చేశారు. పప్పు దినుసులు, వేరుశనగ 25 శాతం మాత్రమే కేంద్రం కొనుగోలు చేస్తుందన్నారు. అంటే మిగతా పంటను రైతులు బయట అమ్ముకోవాలా? అని ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు. దళారుల దయాదాక్షిణ్యంపై రైతులు ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొందని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. 50 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కేంద్రం కొంటుందని.. మిగతా పంటను రైతులు ఏం చేయాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలంటున్న రైతులకు ప్రభుత్వం భరోసా ఇస్తుందా అని అడిగారు. తడి గుడ్డతో రైతుల గొంతును రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోస్తుందన్నారు. రైతులు జీవితాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటం ఆడుతున్నాయన్నారు. ఎకరాకు రెండు బస్తాల యూరియా మాత్రమే.. అదీ నెలకు ఒకటి చొప్పున ఇస్తారట అంటూ ఆయన ఆందోళన చెందారు. రైతులంటే మీకు ఎందుకు ఇంత చిన్నచూపు అని మంత్రులను ఆయన ప్రశ్నించారు. యూరియా ఇచ్చే తెలివి కూడా లేదా అని ప్రభుత్వాన్ని నిలదీశారు. మిర్చి రైతులు ఎకరాకు ఐదారు యూరియా బస్తాలు వాడుతారని.. మరి మీరు రెండే ఇస్తే మిగతాది ఎట్లా అని ప్రశ్నించారు. కేంద్రం 30 శాతం యూరియా ధరలు పెంచిందని వివరించారు. రెండు బస్తాల ఆలోచన విరమించుకోవాలని ప్రభుత్వానికి ఆయన హితవు పలికారు. 45 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయిల రైతు బంధు ఇస్తామన్నారని.. 90 రోజులు అయ్యిందని.. ఇప్పటికీ రైతుల ఖాతాల్లో నగదు మొత్తం పడలేదని విమర్శించారు. ఎకరాకు రూ.15 వేలు అన్నారని చెప్పారు. 2024-25 వానాకాలం పంటకు ఒక్క రూపాయి ఇవ్వలేదని.. పూర్తిగా ఎగ్గొట్టారని తెలిపారు. ల్గ÷తుబంధు కింద కాంగ్రెస్ ప్రభుత్వం మొత్తం 5 పంటలకు రైతులకు రూ.29,358 కోట్లు బకాయి పడ్డిందని అన్నారు. రైతు బీమా ఆగలేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల చెప్పారని గుర్తు చేశారు. మరి ఈ ఏడాది జనవరి నుంచి నేటి వరకు రైతు బీమా ఆగిందా? లేదా చెప్పాలని మంత్రులను ఆయన బల్ల గుద్ది ప్రశ్నించారు. దీనిపై చర్చకు ఏ ఊరుకైనా పోదాం వస్తారా అని మంత్రులకు ఆయన సవాల్ విసిరారు. మొత్తం రాష్ట్రంలో 7,600 మందికి బీమా రాలేదని గణాంకాలతో సహా హరీశ్‌రావు వివరించారు. ఎందుకు భీమా రావడం లేదంటే.. ప్రభుత్వం ప్రీమియం కట్టలేదన్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో గురువారం మీరు కేబినెట్‌లో చేసిన తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. అన్ని పంటలు యథావిధిగా కొనుగోలు చేయాలని ప్రభుత్వానికి స్పష్టం చేశారు. తప్పుడు నిర్ణయం తీసుకున్నందుకు రైతులకు క్షమాపణ చెప్పాలని రేవంత్ సర్కార్‌ను హరీశ్ రావు డిమాండ్ చేశారు.

# నేడు అన్నదాత సుఖీభవ నిధుల విడుదల

దీంతో కేంద్రం, ఏపీ ప్రభుత్వం ఒకే రోజు రైతుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నాయి. ఇంకో వైపు జూన్ 30వ తేదీన రాష్ట్రంలోని రైతులకు రైతు భరోసా నిధులు విడుదల చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. ఆ రోజు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మధిరలో నిర్వహించే సభలో సీఎం రేవంత్ రెడ్డి ఈ నిధులను విడుదల చేయనున్నారు.

# భూవివాదాలు లేని తెలంగాణ నిర్మాణమే లక్ష్యం

హైదరాబాద్ : భూ సమస్యలు, భూవివాదాలు లేని తెలంగాణను నిర్మించాలనే లక్ష్యంతో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో భూ సర్వే నిర్వహించాలని కీలక నిర్ణయం తీసుకుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా భూముల రీసర్వే కార్యక్రమాన్ని వచ్చే నెల నుంచి దశల వారీగా ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. శుక్రవారం నాడు రెవెన్యూ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి గారు మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 10,954 రెవెన్యూ గ్రామాలుండగా తొలి దశలో హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాల నుంచి 70 గ్రామాల చొప్పున మొత్తం 2240 గ్రామాలను ఎంపిక చేసి రీసర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భూమి రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదని.. అది అతని జీవనాధారమని ప్రతి అంగుళం భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్‌కు భూధార్, ప్రతి రైతుకు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణను భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ఈ రీ-సర్వే కార్యక్రమం చారిత్రాత్మక మైలురాయిగా నిలుస్తుందని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో 1936 నాటి నిజాం కాలం సర్వే రికార్డులే ప్రధాన ఆధారంగా ఉన్నాయని, కాలక్రమేణా భూముల విభజనలు, ఉపసంఖ్యలు పెరగడం, పట్టణీకరణ విస్తరించడం, పరిపాలనా సరిహద్దులు మారడం వల్ల అనేక ప్రాంతాల్లో భూముల అసలు హద్దులపై స్పష్టత లేకుండా పోయిందన్నారు. ఈ పరిస్థితులకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం సమగ్ర రీ-సర్వే చేపడుతోందని తెలిపారు. భూ వివాదాల పరిష్కారంలో భాగంగా రాష్ట్రంలో నిజాం కాలం నుంచి నక్షాలు లేని 378 గ్రామాలను గుర్తించామని, వాటిలో ఇప్పటికే 5 గ్రామాల్లో రీ-సర్వే పూర్తి చేసి భూధార్ నంబర్లు కేటాయించినట్లు తెలిపారు. మిగిలిన 373 గ్రామాల్లో కూడా రోవర్స్ వంటి ఆధునిక సాంకేతికతతో సర్వే పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. గొలుసులు, కర్రలు, క్రాస్ స్టాఫ్, మెజరింగ్ టేప్ వంటి పాత సర్వే పరికరాలకు పూర్తిగా స్వస్తి చెబుతున్నామని మంత్రి తెలిపారు. డీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్, క్యూజీఐఎస్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ శాస్త్రీయ పద్ధతిలో భూముల సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే 411 రోవర్స్ కొనుగోలు చేయగా, త్వరలో మరో 400 రోవర్స్ కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు. భూముల రీ-సర్వే పూర్తయిన తర్వాత ప్రతి భూకమతానికి ఖచ్చితమైన హద్దులను నిర్ణయించి, ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయించనున్నట్లు మంత్రి తెలిపారు. ఆధార్ తరహాలో ప్రతి భూమికి ప్రత్యేక గుర్తింపుగా భూదార్ కార్డులు జారీ చేస్తామని చెప్పారు. డీజీపీఎస్ ద్వారా సేకరించిన సమాచారాన్ని క్యూజీఐఎస్ సాఫ్ట్‌వేర్‌లో నిక్షిప్తం చేసి భూ భారతి పోర్టల్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు.తెలంగాణ ప్రాంతంలో 1948 నాటికి సుమారు 40 లక్షల సర్వే నంబర్లు ఉండగా, ప్రస్తుతం అవి 2 కోట్ల 29 లక్షలకు పెరిగాయని రాష్ట్రంలోని అన్ని సర్వే నంబర్లకు దశలవారీగా భూదార్ నంబర్లు కేటాయించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ రూపొందించిందన్నారు. రీ-సర్వే కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన మానవ వనరులను ప్రభుత్వం సమకూర్చిందని, 5,520 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ ఇచ్చి లైసెన్సులు జారీ చేశామని, భూవిస్తీర్ణాన్ని బట్టి ప్రతి మండలానికి 4 నుంచి 6 మంది సర్వేయర్లను నియమించామని చెప్పారు. రాష్ట్రంలోని రెవెన్యూ గ్రామాలను క్లస్టర్లుగా విభజించి ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. భూముల రీ-సర్వే పూర్తయిన తర్వాత ప్రతి కమతానికి ఖచ్చితమైన సరిహద్దులు, ప్రత్యేక పటాలు సిద్ధమవుతాయని, తద్వారా భూ యాజమాన్యంపై ఎలాంటి వివాదాలకు తావు ఉండదన్నారు. భూ భారతి చట్టం ద్వారా సాగు భూముల రిజిస్ట్రేషన్లకు సర్వే పటం తప్పనిసరి చేసిన నేపథ్యంలో రీ-సర్వే ద్వారా భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ప్రక్రియలు మరింత పారదర్శకంగా, వేగవంతంగా మారనున్నాయని తెలిపారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసు

## విచారణకు హాజరైన చీకోటి ప్రవీణ్

హైదరాబాద్,జూన్19 : ఫోన్ ట్యాపింగ్ కేసులో బీజేపీ అధికార ప్రతినిధి చికోటి ప్రవీణ్ విచారణ ముగిసింది. దాదాపు గంటన్నరపాటు ప్రవీణ్‌ను సిట్ అధికారులు విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ సిట్ కార్యాలయంలో ఆయనను అధికారులు విచారించారు. విచారణకు ముందు సిట్ కార్యాలయం ఎదురుగా ఉన్న అమ్మవారి దేవాలయంలో దర్శనం చేసుకున్నారు చికోటి ప్రవీణ్. సిట్ విచారణ అనంతరం మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ.. ’ఫోన్ ట్యాపింగ్‌పై సిట్ అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చాను. మా ఫోన్లు ట్యాప్ చేసి వ్యక్తిగత విషయాలను విన్నారు. ఊహించిన దానికన్నా ఘోరంగా ఫోన్ల ట్యాపింగ్ జరిగినట్లు విచారణలో నాకు అర్థమైంది. నేను 200మంది ఫోన్లు మాత్రమే ట్యాప్ అయ్యాయని అనుకున్నా. కానీ ఆ జాబితా రెండు వేలకు పైగా ఉంది. నాకు దగ్గరిగా ఉన్న వారి ఫోన్లనూ విన్నారు. విచిత్రం ఏమిటంటే, ఎక్కువగా బీఆర్ఎస్ నాయకులకు సంబంధించిన ఫోన్లనే ట్యాప్ అయ్యాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల భార్యలు, పనిమనుషులకు సంబంధించిన ఫోన్లను ట్యాప్ చేశారు.

# పాత అడ్మిట్ కార్డులు చెల్లవు

**వాట్సాప్ ద్వారా సచారం తెలుసుకునే వీలు**

**నీట్ విద్యార్థులకు ఎన్‌టిఎ కీలక సమాచారం**

న్యూఢిల్లీ,జూన్19 : నీట్ అడ్మిట్ కార్డులపై ఎన్‌టీఏ కీలక ప్రకటన చేసింది. అడ్మిట్ కార్డులను ఇప్పటికే డౌన్‌లోడ్ చేసుకున్నవారు మళ్లీ చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపింది. కొత్త అడ్మిట్ కార్డులను ఇంకా డౌన్‌లోడ్ చేసుకోని విద్యార్థుల కోసం ఎన్‌టీఏ నుంచి ఎస్‌ఎమ్‌ఎస్, ఈ-మెయిల్, వాట్సాప్ సేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించింది. మే 3 నాటి పాత అడ్మిట్ కార్డులు ఇకపై చెల్లవని స్పష్టం చేసింది. కొత్త అడ్మిట్ కార్డ్‌లను అధికారిక వెబ్‌సైట్ నుంచి మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది. పలువురు విద్యార్థుల కోరిక మేరకు వారు కోరిన నగరాల్లో కొత్త పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. నీట్ 2026 అభ్యర్థుల కోసం ఎన్‌టీఏ వాట్సాప్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. జూన్ 21 ఆదివారం జరగబోయే నీట్ రీ-ఎగ్జామినేషన్ సమాచారం ఇకపై నేరుగా వాట్సాప్ ద్వారా అభ్యర్థులకు అందనుంది. 91- 78279 80287 నంబర్ నుంచి మాత్రమే అధికారిక సమాచారం వస్తుందని ఎన్‌టీఏ వెల్లడించింది. బ్లూ టిక్ లేని నంబర్ల నుంచి వచ్చే మెసేజ్‌లను నమ్మవద్దని విద్యార్థులను హెచ్చరించింది.

# జిమ్‌లపై పోలీసుల దాడులు

**శరీరాకృఇ కోసం స్టెరాయిడ్స్ వినియోగం**

హైదరాబాద్ : నగరంలోని పలు జిమ్‌లపై ఏసీపీ ఆకస్మిక తనిఖీలు కొనసాగుతున్నాయి. ఇటీవల జిమ్‌లలో వరుసగా యువకులు ప్రాణాలు కోల్పోతున్న ఘటనల నేపథ్యంలో పోలీసులు రంగంలోకి దిగారు. శరీరాకృతి కోసం స్టెరాయిడ్లను విచక్షణారహితంగా వాడటం వల్ల తీవ్రమైన గుండె జబ్బులు, కిడ్నీ సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. దీంతో వెంటనే అప్రమత్తమైన పోలీసులు హైదరాబాద్‌లోని పలు జిమ్‌లలో వరుసగా తనిఖీలు చేస్తున్నారు. శుక్రవారం కుల్సుంపురా, టప్పాచబుత్ర, గుడిమల్కాపూర్ ప్రాంతాల్లోని జిమ్‌లలో పోలీసుల ముమ్మరంగా సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో శరీరాకృతి కోసం యువత యథేచ్ఛగా స్టెరాయిడ్ ఇంజెక్షన్లు, మాత్రలు వాడుతున్నట్లు గుర్తించారు. జిమ్‌లలో యువకులను కలిసిన ఏసీపీ.. స్టెరాయిడ్ల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. షార్ట్‌కట్ పద్ధతులను వదిలి, సహజ పద్ధతుల్లోనే ఫిట్‌నెస్ సాధించాలని యువతకు పోలీసులు సూచనలు చేస్తున్నారు.

# వర్షాలు సమృద్ధిగా కురవాలని పూజలు

ఆదిలాబాద్,జూన్18 : ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం రాంపూర్‌లో ఆదివాసులు అకాడి పండుగను గురువారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామ సమీపంలోని శివారులో వన దేవతకు సాంప్రదాయ పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పశువులకు కొత్తగా చిగురించిన మేతను తినిపించారు. వర్షాలు సమృద్ధిగా కురువాలని , పంట దిగుబడి రావాలని, మూగజీవాలకు, పశు కాపర్లకు విష జంతువుల నుంచి ఎలాంటి హాని కలుగకుండా రక్షణ కల్పించాలని వన దేవతకు వేడుకున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ హెచ్ కె జంగు పటేల్, దేవారి రూప్ దేవ్, జగ్గేరావు, సీతారాం, దేవ్ రావు, పాండు, దాది రావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# అనుమానాస్పద స్థితిలో దంపతుల మృతి

**కుమారుడి ఫిర్యాదుతో పోలీసుల దర్యాప్తు**

కుమ్రంభీం ఆసిఫాబాద్,జూన్18 : కుమ్రం భీం జిల్లా ఆసిఫాబాద్ మండలంలో అనుమానాస్పద స్థితిలో దంపతులు మృతి చెందడం కలకలం సృష్టిస్తోంది. తుంపల్లి గ్రామపంచాయతీ కోసార గ్రామ పరిధిలోని భవానీ నగర్‌లో దారుణం చోటు చేసుకుంది. బానోత్ రాజు ,సునీత దంపతులు బుధవారం రాత్రి అనుమానాస్పదంగా మృతి చెందారు. ఇద్దరు దంపతులు కొడుకు, కోడలుతో కలిసి భవానీ నగర్‌లో జీవనం కొనసాగిస్తున్నారు. రాత్రి భోజనం చేసిన అనంతరం భార్యాభర్తలు ఇద్దరు ఇంటి బయట వరండాలో పడుకున్నారు. రాత్రి 3 గంటల ప్రాంతంలో కరెంట్ పోవడంతో కోడలు తమ చిన్న పాపను అత్త సునీత దగ్గర పడుకోబెట్టేందుకు వచ్చి నిద్ర నుంచి లేపే ప్రయత్నం చేయగా ఆమె నుంచి స్పందన రాకపోవడంతో చూడగా అప్పటికే ఇద్దరు మృతి చెందారు. గతంలో పీరీల విషయంలో గొడవలు జరిగాయని, తమ తల్లిదండ్రులను హత్య చేసి ఉంటారని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆసిఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# సింగరేణిపై బిజెపి చిల్లర రాజకీయాలు

**అక్కడ పర్యటించే హక్కు ఆ నేతలకు లేదు**

**ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ విమర్శలు**

హైదరాబాద్,జూన్19 : సింగరేణిపై బీజేపీ ఇకనైనా చిల్లర రాజకీయాలు మానుకోవాలని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ అన్నారు. సింగరేణి సంస్థపై మాట్లాడే నైతిక అర్హత గానీ, అక్కడ పర్యటించే హక్కు గానీ బీజేపీకి ఎంతమాత్రం లేదని ఆయన స్పష్టం చేశారు. బొగ్గు బ్లాకులను ప్రైవేటుపరం చేయాలని నిర్ణయించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నాయకత్వంలో పనిచేస్తున్న బీజేపీ నాయకులు.. ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని సింగరేణికి వెళ్తున్నారని ఆయన ప్రశ్నించారు.

# కేంద్రానిది అప్పుడూ, ఇప్పుడూ మొండివైఖరే

**కేసిఆర్ రైతులకు అండగా ధాన్యం కొనుగోళ్లు**

**12 వేల కోట్లు ధాన్యం కొనుగోళ్లకు కేటాయించారు**

**మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి**



నిజామాబాద్ : ధాన్యం కొనుగోళ్లలో బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కూడా కేంద్రం కక్షపూరితంగా వ్యవహరించిందని, అయినా ఆనాటి సిఎం కెసిఆర్ ఏనాడూ రైతులకు అన్యాయం చేయలేదని, మాజీమంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. రైతులకు అండగా నిలిచి ఊరూరా కొనుగోలు కేంద్రాలతో పంటలు కొనుగోలు చేయించిన ఘనత కెసిఆర్‌దని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఉత్పత్తి అయిన మొత్తం ధాన్యంలో 3వ వంతు, ఇతర పంటల్లో 25శాతం కొనుగోలు చేయడం ఇప్పుడే అమలుచేసిన కొత్త విధానం కాదు. నాడు బీఆర్ఎస్ సర్కార్ హయాంలోనూ కేంద్ర ప్రభుత్వం ఇదే వైఖరిని అవలంబించింది. రాష్ట్రంలో రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయబోమని అనేక ఇబ్బందులకు గురిచేసింది. ఒక దశలో అప్పటి సీఎం కేసీఆర్ ఏకంగా కేంద్ర ప్రభుత్వంపై తెలంగాణ రైతుల తరఫున పెద్ద పోరాటమే చేశారు. అయినప్పటికీ కేంద్రం తెలంగాణ రైతుల పట్ల తన వివక్షను వీడలేదని గుర్తు చేశారు. ఉత్పత్తి అయిన మొత్తం పంటను కేంద్రమే కొనుగోలు చేయాలని తామూ పోరాడామని అన్నారు. కేంద్రం నిరాకరించినా రాష్ట్రం ముందుకు వచ్చి ధాన్యం సేకించిందని వేముల అన్నారు.కానీ ప్రస్తు రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదని చెబుతున్నది. ఈ నేపథ్యంలో ఓ వైపు కేంద్రం 25శాతం పంటల్ని మాత్రమే కొనుగోలు చేయడం, మిగిలిన పంటను కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరాకరిస్తుండటంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరకంగా మారింది. పంటల కొనుగోళ్లపై ఇటు రాష్ట్రం, అటు కేంద్రం చేతులెత్తేస్తుండటంతో మిగిలిన పంట పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. మిగిలిన పంటను రైతులు ఎక్కడ అమ్ముకోవాలనే ప్రశ్నలు ఉత్పత్తి అవుతున్నాయి. బహిరంగ మార్కెట్లో విక్రయిద్దామంటే మద్దతు ధర దక్కే పరిస్థితి లేదు. తప్పని పరిస్థితుల్లో విక్రయించిన రైతులు నష్టాలు మూటగట్టుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతువ్యతిరేక చర్యలతో ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఉత్పత్తుల విక్రయం దైవాధీనంగా మారిందని అన్నారు. పెట్టుబడి పెట్టి పంటలు పండించిన రైతులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. కేంద్ర సహాయ నిరాకరణతో రాష్ట్ర రైతుల కోసం నాడు కేసీఆర్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. కేంద్రం కొనుగోలు చేయని పంటలను రాష్ట్ర ప్రభుత్వం తన సొంత నిధులతో మొత్తం కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చినా, ఇవ్వకపోయినా, కొనుగోలు చేసినా, చేయకపోయినా రైతులు పండించిన మక్కలు, జొన్నలు, కందులు, పెసర్లు, సోయాబీన్, శనగలు, సన్‌ఫ్లవర్ పంటలను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేసింది. ఇందుకోసం ఏకంగా రూ.12వేల కోట్లను ఖర్చు చేసింది. ముఖ్యంగా కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో బహిరంగ మార్కెట్లో పంటలు కొనుగోలు చేసే దిక్కులేక రైతులు విలవిల్లాడిపోతే రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా అన్ని పంటలను మొత్తం కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచిందని గుర్తు చేశారు. ప్రతిపక్షంలో ఉండగా పంటల కొనుగోళ్లపై కాంగ్రెస్ పార్టీ చేసిన రాద్ధాంతం అంతాఇంతా కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం పంటలు కొనుగోలు చేయకపోతే రాష్ట్రం ప్రభుత్వం ఏం చేస్తుందని, రైతుల పంటలు కొనుగోలు చేసేందుకు కూడా పైసలు లేవా? అంటూ నాటి పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి ప్రశ్నించిన విషయం గుర్తు చేశారు. తాము అధికారంలోకి వస్తే ప్రతి పంటనూ మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని, అంతేకాదు.. మద్దతు ధరకు అదనంగా బోనస్ కూడా చెల్లిస్తామని ప్రకటించారు. తీరా అధికారంలోకి వచ్చిన రెండున్నరేండ్లలోనే పంటల కొనుగోళ్లపై చేతులెత్తేసిందని మండిపడ్డారు. నాడు పదేండ్ల పాటు రైతులకు ఇబ్బందుల్లేకుండా కేసీఆర్ పంటలు కొనుగోలు చేస్తే.. ఇప్పుడు రేవంత్ సర్కార్ రెండున్నరేండ్లకే తమ వల్ల కాదని చేతులెత్తేసిందని అన్నారు. ఉత్పత్తి చేసిన మొత్తం పంటలను కొనుగోలు చేయాలని, లేకుంటే రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

# హైదరాబాద్‌లో కొనసాగుతున్న ఫుడ్ సేఫ్టీ దాడులు

**ప్రముఖ హోటళ్లలో కుళ్లిన చికెన్ గుర్తింపు**

**పలు రెస్టారెంట్లకు నోటీసులు జారీ**

హైదరాబాద్,జూన్19 : నగరంలో ఫుడ్ సేఫ్టీ అధికారుల స్పెషల్ డ్రైవ్ కొనసాగుతోంది. హోటల్స్, రెస్టారెంట్లలో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 45 ప్రముఖ ఫుడ్ లే అవుట్లు, 8 పన్నీర్ తయారీ కేంద్రాలపై దాడులు చేశారు. మరో రెండు రోజులపాటు ఫుడ్ సేఫ్టీ, టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులు కొనసాగనున్నాయి. ఈ దాడుల్లో రెస్టారెంట్లు, హోటల్స్ కిచెన్స్‌లో అధ్వానమైన పరిస్థితులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. జూబ్లీహిల్స్, మాదాపూర్‌లోని ప్రముఖ రెస్టారెంట్లలో రోజుల తరబడి కుళ్లిన చికెన్, పన్నీర్ ఉన్నట్లు సోదాల్లో బయటపడింది. దీంతో దాదాపు 20 రెస్టారెంట్లకు అధికారులు పెనాల్టీలు, నోటీసులు జారీ చేశారు. బేగంబజార్, కాటేదాన్ ప్రాంతాల్లో పన్నీర్ తయారీ కేంద్రాలపై దాడులు చేయగా.. అక్కడి వాతావరణం చూసి అధికారులే షాక్‌కు గురయ్యారు. గంజి పొడి, జంతువుల కొవ్వు ఉపయోగించి పన్నీర్ తయారు చేస్తున్నట్లు గుర్తించారు. ఫుడ్ సేఫ్టీ, టాస్క్‌ఫోర్స్ అధికారుల నేతృత్వంలో తనిఖీలు కొనసాగుతున్నాయి. పాతబస్తీలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లపై హెచ్ ఫాస్ట్ దాడులు నిర్వహించింది. వాడిన ఆయిల్‌ను పదేపదే వినియోగిస్తున్నట్లు గుర్తించారు. అత్యంత ప్రమాదకర రసాయనాలతో సాస్ తయారుచేసి విక్రయాలు జరుపుతున్నట్లు తేలింది. కుళ్లిన కూరగాయలతో సమోసాలు, ప్రమాదకర స్థితిలో ÷-రెడ్ చికెన్ తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో ఫాస్ట్‌ఫుడ్ తయారీ గోదామును పోలీసులు మూసివేశారు.

# అనుమానం..పెను భూతమై

**పసికందును బలి తీసుకున్న తండ్రి**

**భార్యపై అనుమానంతో చిన్నారి హత్య**

నిజామాబాద్,జూన్19 : నిజామాబాద్ పట్టణంలో దారుణ ఘటన వెలుగు చూసింది. రెండు నెలల చిన్నారిని కన్నతండ్రే అత్యంత దారుణంగా నరికి చంపడం కలకలం రేపింది. భార్యపై అనుమానంతో పిల్లాడు తనకు పుట్టలేదన్న అనుమానంతో నిందితుడు ఈ ఘాతుకానికి పాల్పడటం కలకలం రేపుతోంది. మహారాష్ట్రలోని నయాగావ్‌కు చెందిన యువరాజ్, నిజామాబాద్‌లోని అశోక్‌నగర్ కాలనీకి చెందిన ప్రియాంక ఏడాది కిందట వివాహం చేసుకున్నారు. కొన్ని నెలలపాటు వారి బంధం అన్యోన్యంగా సాగింది. ఆ తర్వాత ప్రియాంకపై యువరాజ్ అనుమానం పెంచుకోవడం ప్రారంభించాడు. ప్రియాంకను అనుమానిస్తూ ప్రతిరోజూ వేధించడం మొదలుపెట్టాడు. మరోవైపు ఆమె గర్భం దాల్చడంతో వేధింపులు మరింత పెరిగాయి. ఇటీవల పుట్టింటికి వచ్చిన బాధిత తల్లి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అయితే, చిన్నారి తనకు పుట్టలేదంటూ ప్రియాంక కుటుంబ సభ్యులతో పలుమార్లు యువరాజ్ గొడవకు దిగాడు. ఈ నేపథ్యంలోనే జూన్ 17న బుధవారం చిన్నారిని ఇంటి నుంచి తీసుకెళ్లిపోయాడు. అనంతరం నిర్మానుష్య ప్రదేశంలో బాలుడిని కత్తితో పలుమార్లు నరికి హత్య చేశాడు. ఆ తర్వాత మృతదేహాన్ని రైల్వే పట్టాల పక్కన పడేసి పరారయ్యాడు. సాయంత్రం అయినా భర్త, కుమారుడు ఇంటికి రాకపోవడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడు కోసం గాలింపు చర్యలు చేపట్టి శు క్రవారం అదుపులోకి తీసుకున్నారు. అనంతరం చిన్నారి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. బాలుడి మృతితో ప్రియాంక, ఆమె కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాం నింపింది. యువరాజ్ కిరాతక చర్యపై పట్టణవాసులు తీవ్రంగా నిరసించారు. కఠినంగా శిక్షించాలని కోరారు.

# ఇంద్రకీలాద్రిపై భక్తులకు మెరుగైన సేవలు

**పరిసరాలను పరిశీలించి, తనిఖీలు చేసిన ఇవో**

**భక్తులతో మాట్లాడి సౌకర్యాలపై ఆరా**

విజయవాడ : దుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన డిజిటల్ సేవలు అందించడమే లక్ష్యమని శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి శీనా నాయక్ స్పష్టం చేశారు. శుక్రవారం ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానంతోపాటు పరిసర ప్రాంతాల్లో ఈవో శీనా నాయక్ విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యాలు, శానిటేషన్, భద్రతపై అధికారులతోపాటు సిబ్బందికి ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. దుర్గా ఘాట్‌లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని వారికి స్పష్టం చేశారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు గదులు ఏర్పాటు చేయాలని సూచించారు. దుర్గా ఘాట్‌లో 'మన మిత్ర' వాట్సాప్ టికెటింగ్ సేవలను ఈ సందర్భంగా దేవస్థానం ఈవో పరిశీలించారు. కేశఖండనశాలలో సిబ్బంది హాజరు, ఫిర్యాదుల రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. అలాగే ఆలయంలో అందుతున్న సేవలపై అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులతో మాట్లాడారు. ఎస్‌బీఐ విరాళంగా ఇచ్చిన సిమెంట్ కుర్చీలపై భక్తుల హర్షం వ్యక్తం చేశారు. కొత్త షెడ్లతోపాటు కూర్చోవడానికి చేసిన ఏర్పాట్లపై భక్తులు సంతృప్తి చెందారు. కనకదుర్గ నగర్‌లో హాకర్ల నియంత్రణ, భద్రతా ఏర్పాట్లను ఈవో శీనా నాయక్ పరిశీలించారు. ప్రసాదం కౌంటర్లలో స్టాక్ నాణ్యతను తనిఖీ చేశారు. మహా మండపంలో కొత్త వాట్సాప్ బుకింగ్ కౌంటర్లను కూడా ఆయన తనిఖీ చేశారు. పాత మెట్ల మార్గంలో భక్తుల సౌకర్యాలను సైతం ఈవో పరిశీలించారు. క్యూ లైన్లలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన తాగునీటి సౌకర్యాలను ఈవో పరిశీలించారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన సేవలు అందిస్తామని ఈ సందర్భంగా ఈవో శీనా నాయక్ వెల్లడించారు. ఘాట్ రోడ్డులో భక్తుల కోసం 800 ఇనుప కుర్చీలను ఏర్పాటు చేశారు.

# ముగిసిన బ్రహ్మనాయుడు కస్టడీ

**కోర్టుకు తరలించిన పోలీసులు**

హైదరాబాద్,జూన్18 : ఫేక్ జీవో కేసులో వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కస్టడీ పూర్తయ్యింది. మూడురోజుల కస్టడీ ముగియడంతో బొల్లా బ్రహ్మనాయుడిని రంగారెడ్డి జిల్లా కోర్టుకు పోలీసులు తరలించారు. బ్రహ్మనాయుడిని సైబరాబాద్ ఈవోడబ్ల్యూ అధికారులు మూడు రోజులపాటు కస్టడీకి తీసుకొని విచారించారు. అయితే కస్టడీలో పోలీసులకు మాజీ ఎమ్మెల్యే ఏమాత్రం సహకరించనట్లు తెలుస్తోంది. ఏ ప్రశ్న అడిగినా 'తెలియదు, గుర్తులేదు' అనే సమాధానాలు చెప్పినట్లు సమాచారం. రూ.1000 కోట్ల భూమిని అక్రమంగా కొట్టేయాలని బ్రహ్మనాయుడు ఎ÷-లాన్ చేసినట్టు ఈవోడబ్ల్యూ అధికారుల విచారణలో వెల్లడైంది. భూమిని కొట్టేసేందుకు బ్రహ్మనాయుడు రూ.8 కోట్లు సమకూర్చినట్లు అధికారులు గుర్తించారు. దీనిపైనే ప్రశ్నలు వేయగా.. మాజీ ఎమ్మెల్యే సమాధానాలు దాటవేసినట్లు తెలుస్తోంది. మరికొన్ని ప్రశ్నలకు మౌనంగా ఉంటూ తనకేం తెలియదని బుకాయించే ప్రయత్నం చేసినట్లు సమాచారం. ఇప్పటికే ఐదుగురు నిందితులు కస్టడీలో వెల్లడించిన వివరాలను ఆధారంగా చేసుకొని బ్రహ్మనాయుడిని అధికారులు ప్రశ్నించారు. 'వారు చెప్పిన సమాధానాలకు నాకు ఎలాంటి సంబంధం లేదు' అని పోలీసుల ముందు బ్రహ్మనాయుడు బుకాయించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది.

# టిఎంసికి హైకోర్టులో ఎదురుదెబ్బ

**రితబ్రత బెనర్జీ నియామకంపై సవాల్**

**మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమన్న హైకోర్టు**

కోల్‌కతా,జూన్18 : తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా తిరుగుబాటుచేసిన ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై కోల్‌కతా హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులిచ్చేందుకు నిరాకరించింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ కృష్ణారావు నేతృత్వంలోని ధర్మాసనం.. తదుపరి విచారణ జరిపేంత వరకు స్పీకర్ నిర్ణయం అమలులో ఉంటుందని స్పష్టం చేసింది. ఈ పిటిషన్ తదుపరి విచారణకు ముందే అఫిడవిట్ల మార్పిడిని పూర్తి చేయాలని ఇరు పక్షాలను ఆదేశించింది న్యాయస్థానం. ప్రతివాదులు మూడు వారాల్లోగా తమ వ్యతిరేక అఫిడవిట్‌ను దాఖలు చేయాలని, దానిపై మరో పక్షం వారు రెండు వారాల్లోగా స్పందించాలని గడువు విధించింది. ఈ విషయంపై తదుపరి విచారణ జులై 28కి వాయిదా వేసింది. దీంతో ఈ కేసు ఫలితం వెలువడే వరకు రితబ్రత బెనర్జీ గుర్తింపు పొందిన ప్రతిపక్ష నేతగా కొనసాగనున్నారు. కాగా.. టీఎంసీ నుంచి బహిష్కృమైన రితబ్రత బెనర్జీ.. ఆ పార్టీకి వ్యతిరేకంగా తిరుగుబాటు ఎమ్మెల్యేలకు న్యాయకత్వం వహిస్తున్నారు. దీంతో బెంగాల్ రాజకీయ సంక్షోభంలో వివాదం రాజుకుంది. తమకు 58 మంది టీఎంసీ ఎమ్మెల్యేల మద్దతుందని పేర్కొంటూ, ఆమె మేనల్లుడైన అభిషేక్ బెనర్జీకి వ్యతిరేకంగా ఓ చీలిక వర్గాన్ని ఏర్పాటు చేశారు రితబ్రత. అయితే.. తిరుగుబాటు వర్గం వాదనను అంగీకరిస్తూ రితబ్రతను ప్రతిపక్ష నాయకుడిగా ఆ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రతీంద్ర బోస్ నియమించడంతో ఈ వివాదం మరింత ముదిరింది. స్పీకర్ నిర్ణయం అధికారికంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీని పక్కనపెట్టిందని, శాసనసభ పార్టీల గుర్తింపును నియంత్రించే రాజ్యాంగ నిబంధనల్ని ఉల్లంఘించిందని వాదిస్తూ.. దీదీ వర్గం కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే.

# ఏడు రకాలే సాగు చేయాలన్న ఆంక్షలు సరికాదు

**రైతులకు అండగా ప్రభుత్వం నిలబడాలి**

**మాజీమంత్రి నిరంజన్ రెడ్డి**

మహబూబ్‌నగర్,జూన్19 : ఎల్‌నినో ప్రభావంతో రైతులు ఇప్పటికే సాగులో ముందుకు సాగలేక ఇబ్బందులు పడుతుంటే, ప్రభుత్వం కేవలం 7 సన్నరకాల పంటలనే సాగు చేయాలని ఆంక్షలు పెట్టడం సరికాదని మాజీమంత్రి నిరంజన్ రెడ్డి హితవు పలికారు. దిగుబడి లేని పంటలను సాగు చేయాలంటే రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలిపారు. ప్రభుత్వం సూచించే ఆ ఏడు రకాల పంటలకు చీడపురుగుల సమస్య కూడా అధికంగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం నాడిక్కడ మాట్లాడుతూ గతంలో 33 సన్న రకాలను గుర్తించిన రేవంత్‌రెడ్డి సర్కార్.. ఇప్పుడు ఏడింటికే కుదించడం ఏమిటని ప్రశ్నించారు. రైతులు ఏ రకమైన పంట సాగుచేసినా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందనే నమ్మకాన్ని, భరోసాను రైతులకు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ఖరీఫ్‌లోనైనా రైతు భరోసా రూ.15,000 చొప్పున వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు. ధాన్యం బోనస్ ఇవ్వడాన్ని ఈ ప్రభుత్వం పూర్తిగా మర్చిపోయిందని విమర్శించారు. రైతు బీమా ఏమైందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. చనిపోయిన రైతుల కుటుంబ సభ్యులు చెప్పులరిగేలా తిరుగుతున్నా పట్టించుకునేనాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. 'యూరియా సామాన్యులకు ఏమి అర్థమవుతుందని పేర్కొన్నారు. ఈసారైనా రైతులు యూరియా కోసం పడికాపులు కాయకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. గతంలో వరి ధాన్యం కొనుగోలు చేయకపోతే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇంటి ముందు ధాన్యం పోసి ధర్నా చేస్తానన్న రేవంత్.. ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ధాన్యం కొనుగోలుపై రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పెద్ద ప్రకటనలు గుప్పిస్తున్నదే తప్ప క్షేత్రస్థాయిలో రైతులకు దకిందేమీ లేదని తెలిపారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను రైతులు అడ్డికి పావుసేరు చొప్పున అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం సేకరణ బాధ్యతల నుంచి తప్పించుకొనేందుకే కుంటిసాకులు వెతుకుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

# మలేషియాలో మంత్రి నారాయణ పర్యటన

**ఘన వ్యర్థాల నిర్వహణపై మంత్రి పరిశీలన**

అమరావతి,జూన్19 : మలేషియాలో ఏపీ మంత్రి నారాయణ పర్యటన రెండో రోజు కొనసాగుతోంది. మలేషియాలో ఘన వ్యర్థాల నిర్వహణ, తక్కువ ధరలో ఇళ్ల నిర్మాణం వంటి ప్రాజెక్టుల్లో అమలు చేస్తున్న అత్యుత్తమ పద్ధతులను మంత్రి అధ్యయనం చేస్తున్నారు. సెలాంగోర్ రాష్ట్రంలోని బుకిత్ తగర్ ఎన్విరో పార్క్‌ను సందర్శించారు. మలేషియాలో అతిపెద్ద శానిటరీ ల్యాండ్ ఫీలింగ్ ప్రాంతంగా బుకిత్ తగర్ పేరొందింది. ఘన వ్యర్థాలను పర్యావరణానికి హాని లేకుండా శాస్త్రీయ పద్ధతిలో పూడ్చిపెట్టే విధానాన్ని మంత్రి అధ్యయనం చేశారు. భూమి, నీరు కలుషితం కాకుండా వ్యర్థాల నిర్వహణ ఏ విధంగా చేస్తున్నారో మంత్రికి అధికారులు వివరించారు. బెర్జయ గ్రూప్ నిర్మిస్తున్న హౌసింగ్ ప్రాజెక్టులను పరిశీలించనున్నారు. బెర్జయ గ్రూప్.. తక్కువ ధరలో అందరికీ అందుబాటులో ఉండేలా ఇళ్లను నిర్మిస్తోంది.

# సంపాదకీయం

## సమగ్ర పంటల విధానమే మేలు !

దేశంలో పంటల విధానంపై సమగ్రత లోపించింది. రైతులు తమకు తోచిన పంటలు వేస్తున్నారు. ధరల కోసం దేబురిస్తున్నారు. ప్రభుత్వాలు వీలైనంత మేరకు కొంటున్నాయి. వీలుకాకపోతే చేతులెత్తేస్తున్నాయి. ముఖ్యంగా వరి, జొన్న, మక్కజొన్నలనే పండించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికే దేశంలో ధాన్యం బాగా పోగయ్యింది. డిమాండ్ ఉన్న పంటలు వేయడం, సేంద్రియం వైపు మళ్లడంలో రైతులు ఇప్పటికీ వెనకడుగు వేస్తున్నారు. దీంతో సంప్రదాయ వరి పండిస్తూ చేతులు కాల్చుకుంటున్నారు. ఈ విధానం ముందుగా పోవాలి. ప్రభుత్వాలు కూడా రైతులను చైతన్యం చేయడం లేదా, ఫలానా పంటలు వేయండి అని  చెప్పడం లేదు. తెలంగాణ రైతుల పరిస్థితి తీసుకుంటే ఇదే అర్థం అవుతోంది. సన్నాలు పండించిన వారికి గిట్టుబాటు ధరలు వస్తున్నాయి. మద్దతు ధరలను మించి కొంటున్నారు. తాజాగా మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మార్కెట్ యార్డులో సన్న వడ్లకు డిమాండ్ పెరిగింది. వరుసగా రెండ్రోజుల నుంచి 3వేలకు పైగానే మద్దతు ధరలు దక్కుతున్నాయి. ప్రభుత్వం కూడా సన్నాలు పండించాలని, ఏడు రకాలను తాజాగా గుర్తించింది. కానీ మండలాల వారిగా రైతులతో మాట్లాడి వారిని ఒప్పించి, రైతుల పంటల విధానంలో మార్పులు తీసుకుని రావాల్సి ఉంది. ఇవన్నీ ఒక ఎత్తయితే కేంద్రం కూడా ధాన్యం మొత్తాన్ని కొనడానికి ముందుకు రావడం లేదు. టార్గెట్లు విధించి, ఆమేరకు ధాన్యం సేకరణకు రాష్ట్ర ప్రభుత్వాలకు చెబుతోంది. గతంలో బిఆర్ఎస్ అధికారంలో ఉండగా ఇలాగే జరిగింది. ఢిల్లీలో కూడా బిఆర్ఎస్ అధినేత, ఆనాటి సిఎం కెసిఆర్ ధర్నాకు దిగారు. అయినా నేటికీ మార్పు రాలేదు. అందువల్ల రాష్ట్రాలు తమకుతాముగా సమగ్ర పంటల విధానం అమలు చేయాలి. కేవలం ఉచిత విద్యుత్, రైతుభరోసా డబ్బులు వేస్తే సరిపోదు. ఏ పంటలు వేయాలో, వాటికి మార్కెటింగ్ ఎలా ఉంటుందో తెలియచేయాలి. ప్రభుత్వాల జోక్యం లేకుండానే రైతులు పంటలు అమ్ముకునే పరిస్థితిని తీసుకుని రావాలి.ఇక విషయానికి వస్తే ఖరీఫ్ ముంచుకొస్తున్న వేళ రబీ పంటల కొనుగోళ్లు ఇంకా సాగుతూనే ఉన్నాయి.  ఈ క్రమంలో పంటల కొనుగోళ్లపై కాంగ్రెస్ సర్కార్ చేతులెత్తేసింది. రైతులు పండించిన చివరి గింజ వరకు కొంటామంటూ చెబుతూ వచ్చిన మంత్రులు, ఇప్పుడు ఊహించని రీతిలో ప్రకటన చేశారు. ధాన్యం, మక్కజొన్న, జొన్న, కందులు, పెసర్లు.. ఇలా పంట ఏదైనా సరే ఇక రాష్ట్ర ప్రభుత్వం తరఫున పంటలు కొనుగోలు చేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. కేంద్ర ప్రభుత్వం ఎంత కొనాలని చెబితే అంతే కొంటామని, అంతకుమించి గింజ కూడా ఎక్కువ కొనేది లేదని స్పష్టంచేసింది. గురువారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఇన్‌ఫార్మల్ క్యాబినెట్ సమావేశంలో పంటల కొనుగోళ్లపై సంచలన నిర్ణయం తీసుకున్నది. ధాన్యం, మక్కలు, జొన్నలు, కందులు, పెసర్లు ఇలా పంటల కొనుగోళ్ల బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపైకి నెట్టేసింది. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే ఏ పంటనైనా సరే కేంద్రం నిర్దేశించిన కోటా మేరకే కొనుగోలు చేస్తామని మంత్రి ఉత్తమ్ మీడియాకు చెప్పారు. పంటలకు మద్దతు ధరను కేంద్రమే నిర్ణయిస్తుంది కాబట్టి.. పంటల కొనుగోలు బాధ్యత కూడా కేంద్ర ప్రభుత్వానిదేనని అన్నారు. మంత్రి వ్యాఖ్యల నేపథ్యంలో ఇకపై రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయబోదనేది సుస్పష్టం. కేంద్రం కొనుగోలు చేస్తామని చెప్పిన పంటలను, కేంద్రం ఇచ్చిన కోటా మేరకే ఇక్కడ కేంద్రం ఇచ్చిన డబ్బులతో రైతుల నుంచి సేకరించి కేంద్రానికి అందిస్తుంది. అంతేగానీ ఒకవేళ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన కోటాకు మించి పంటలు ఉత్పత్తి అయితే ఆ పంటలను రాష్ట్ర ప్రభుత్వం తన సొంత నిధులతో కొనుగోలు చేయబోదు. పంటల కొనుగోళ్లలో కేంద్రం కోటా పూర్తికాగానే ఆ కేంద్రాలను మూసివేస్తుంది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యంతో పాటు ఇతర పంటలు ఉన్నా ఇక నుంచి ప్రభుత్వం పట్టించుకోదు. మొత్తంగా ఇదే విషయం అర్థం అవుతోంది. ఇలాంటి సమయంలో ఏం చేయాలన్నది కూడా ప్రభుత్వం ప్రకటించాలి. ఎంతమేరకు వరి వేయాలో, అదికూడా ఏ రకం వేయాలో రైతులకు చెప్పాలి. ఏయే జిల్లాల్లో వరి వేయాలో, వేయకూడదో కూడా నిర్ణయించాలి. నిజానికి ధాన్యం సేకరణ బాధ్యత కేంద్రానిదే. కేంద్రం ఆదేశాల మేరకే రాష్ట్రాలు ధాన్యం సేకరణ చేసి, ఎఫ్‌సిఐకి అప్పగిస్తుంది. ఈ క్రమంలో ఢూష్ట్రంలోని వివిధ పంటలను కేంద్ర ప్రభుత్వం కొంత మేరకే కొనుగోలు చేస్తుంది. ఉత్పత్తి అయిన ధాన్యంలో మూడో వంతు మాత్రమే కొంటుంది. ఇక పెసర్లు, కందులు, జొన్నలు, సన్‌ఫ్లవర్, సోయాబీన్ వంటి పంటలను మొత్తం ఉత్పత్తిలో 25శాతం మాత్రమే కొనుగోలు చేస్తుంది. ఒకవేళ కేంద్ర ప్రభుత్వానికి అవసరముండి, పంట ఎక్కువగా ఉంటే మరో 5-10శాతం వరకు కొనుగోలుకు అనుమతి ఇస్తుంది. ఒత్తిడి తెచ్చినర రాష్ట్రాలకే ఈ వెసులబాటు ఉంటుంది. ఇకపోతే కేంద్ర ప్రభుత్వం.. మక్కలను మాత్రం అసలే కొనుగోలు చేయదు. ఎంత ఉత్పత్తి అయినా సరే ఒక్క గింజ కూడా కొనుగోలు చేయదు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం తన కోటా కింద కొనుగోలు చేయగా మిగిలిన పంటలను కొనుగోలు చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే. కేంద్రం తన కోటా మేరకు కొనుగోలు చేసిన తర్వాత మిగిలిన పంట ఉత్పత్తులను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు నిరాకరిస్తే రైతులు ఏం కావాలన్నది ఆలోచన చేయాలి. అందువల్ల పంటల విధానం అమల్లోకి రావాలి. ఏయే పంటలు వేయాలో, ఎంత విస్తీర్ణంలో వేయాలో ప్రభుత్వం నిర్ణయించాలి. అందుకు తగ్గట్లుగా ఎరువుల,విత్తనాలు సరఫరాచేసి, ఆయా పంటలనే ప్రోత్సహించడం ద్వారా సంక్షోభాన్ని అధిగమించవచ్చు.

# విద్యలో విప్లవంతోనే వికసిత భారత్



ప్రస్తుతం భారతదేశం సెమీకండక్టర్ తయారీ పరిశ్రమను అభివృద్ధి చేయడానికి భారీ ప్రణాళికలు రూపొందిస్తోంది. విదేశీ కంపెనీలను ఆహ్వానిస్తూ కర్మాగారాల ఏర్పాటుకు ప్రోత్సా హకాలు ఇస్తోంది. అయితే సెమీకండక్టర్ పరిశ్ర మలో అసలు విలువ కేవలం చిప్ తయారీలో కాదు. చిప్ ఆర్కిటెక్చర్, డిజైన్, పరిశోధన, కొత్త పదార్థాల అభివృద్ధి, ఎలక్ట్రానిక్ డిజైన్ ఆటో మేషన్ వంటి రంగాల్లో ఉంటుంది. ఈ అంశాల్లో భారతదేశానికి అవసరమైన స్థాయిలో శిక్షణ ఇచ్చే విద్యాసంస్థలు చాలా తక్కువ. ఫలితంగా మనం చిప్‌లను తయారు చేసినా, వాటి వెనుక ఉన్న మేధో సంపత్తి మాత్రం విదేశీ సంస్థలదే అవుతుంది. భారతదేశం అనేక రంగాల్లో విదేశీ సాంకేతికతపై ఆధారపడుతున్న వాస్తవాన్ని కూడా విస్మరించలేం. ప్రపంచం ప్రస్తుతం ఒక భారీ సాంకేతిక విప్లవాన్ని ఆవిష్కరిస్తున్నది. ఫలితాలను అనుభవిస్తోంది. కృత్రిమ మేధస్సు (ఎఐ), సెమీకండక్టర్ తయారీ, రోబోటిక్స్, ఏరోస్పేస్ ఇంజినీరింగ్, ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీలు, అరుదైన ఖనిజాల ప్రాసెసింగ్, క్వాంటమ్ కంప్యూటింగ్, బయోటెక్నాలజీ వంటి రంగాలు రాబోయే దశాబ్దాల్లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థను శాసించబోతున్నాయి. ఈ మార్పులను ముందుగానే గుర్తించి తమ విద్యా వ్యవస్థను, పరిశోధనా విధానాలను, పారిశ్రామిక వ్యూహాలను మార్చుకున్న దేశాలే భవిష్యత్తులో ప్రపంచ నాయకత్వాన్ని చేపట్టే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో భారతదేశం తన విద్యా వ్యవస్థ, పరిశోధనా రంగం, పారిశ్రామిక విధానాలపై అత్యవసరంగా పునరాలోచన చేయాల్సిన అవసరం ఏర్పడింది. ఇటీవల చైనా తమ ఆర్థిక, పారిశ్రామిక అవసరాలకు ఉపయోగపడని వందలాది కోర్సులను రద్దు చేసి, వాటి స్థానంలో కృత్రిమ మేధస్సు, చిప్ డిజైన్, విమాన ఇంజిన్ సాంకేతికత, సెమీకండక్టర్ పరిశోధన, పునరుత్పాదక ఇంధన సాంకేతికతలు, రక్షణ రంగ పరిశోధనలకు సంబంధించిన కోర్సులను ప్రవేశపెట్టినట్లు వార్తలు వచ్చాయి. విద్యా వ్యవస్థను నేరుగా దేశ భవిష్యత్ ఆర్థిక లక్ష్యాలకు అనుసంధానం చేయడం ద్వారా చైనా ప్రపంచ తయారీ కేంద్రం మాత్రమే కాకుండా సాంకేతిక శక్తిగా కూడా ఎదుగుతోంది. భారతదేశంలో పరిస్థితి మాత్రం కొంత భిన్నంగా కనిపిస్తోంది. గత కాలపు, వలసవాద భావనలు, దృక్పథాలు ఇంకా మన విద్యావేత్తల, రాజకీయనేతల మెదళ్లలో నుండి తొలగినట్లు లేదు. ప్రతి సంవత్సరం దాదాపు రెండు కోట్ల మంది విద్యార్థులు వివిధ డిగ్రీలు, ఇంజినీరింగ్, ఇతర కోర్సులను పూర్తి చేసి బయటకు వస్తున్నారు. అయితే వీరిలో పెద్ద సంఖ్యలో ఉన్నవారికి ఆధునిక పరిశ్రమలు కోరుకునే నైపుణ్యాలు ఉండటం లేదు. చాలా విశ్వవిద్యాలయాలు ఇప్పటికీ దశాబ్దాల క్రితం రూపొందించిన సిలబస్‌లను స్వల్పమార్పులతో బోధిస్తున్నాయి. ఫలితంగా విద్యార్థులు ఉద్యోగ మార్కెట్ అవసరాలకు దూరంగా ఉండే విద్యను అభ్యసిస్తున్నారు. భారత విద్యా వ్యవస్థలో ప్రధాన లోపం ఏమిటంటే, అది ఇంకా ఉద్యోగుల్ని తయారు చేసే విధానంపైనే ఆధారపడి ఉండటం. ఆవిష్కర్తలు, పరిశోధకులు, సాంకేతికత సృష్టికర్తలు, పారిశ్రామికవేత్తలను తయారు చేయడం దాని ప్రధాన లక్ష్యంగా మారలేదు. ఒక విద్యార్థి నాలుగు సంవత్సరాలు ఇంజినీరింగ్ చదివిన తర్వాత కూడా పరిశ్రమల్లో ఉపయోగించే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై సరైన అవగాహన లేకపోవడం సాధారణ విషయంగా మారింది. డిగ్రీలు పెరుగుతున్నాయి కానీ ప్రపంచ స్థాయి ఆవిష్కరణలు, పేటెంట్లు, స్వదేశీ సాంకేతికతలు మాత్రం తక్కువగానే ఉన్నాయి. సెమీకండక్టర్ రంగాన్ని ఉదాహరణగా తీసుకుంటే ఈ లోపం మరింత స్పష్టంగా కనిపిస్తుంది. ప్రస్తుతం భారతదేశం సెమీకండక్టర్ తయారీ పరిశ్రమను అభివృద్ధి చేయడానికి భారీ ప్రణాళికలు రూపొందిస్తోంది. విదేశీ కంపెనీలను ఆహ్వానిస్తూ కర్మాగారాల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు ఇస్తోంది. అయితే సెమీకండక్టర్ పరిశ్రమలో అసలు విలువ కేవలం చిప్ తయారీలో కాదు. చిప్ ఆర్కిటెక్చర్, డిజైన్, పరిశోధన, కొత్త పదార్థాల అభివృద్ధి, ఎలక్ట్రానిక్ డిజైన్ ఆటోమేషన్ వంటి రంగాల్లో ఉంటుంది. ఈ అంశాల్లో భారతదేశానికి అవసరమైన స్థాయిలో శిక్షణ ఇచ్చే విద్యాసంస్థలు చాలా తక్కువ. ఫలితంగా మనం చిప్‌లను తయారు చేసినా, వాటి వెనుక ఉన్న మేధో సంపత్తి మాత్రం విదేశీ సంస్థలదే అవుతుంది. భారతదేశం అనేక రంగాల్లో విదేశీ సాంకేతికతపై ఆధారపడుతున్న వాస్తవాన్ని కూడా విస్మరించలేం. రక్షణ రంగం, విమానయాన రంగం, ఎలక్ట్రానిక్స్, పారిశ్రామిక యంత్రాల తయారీ వంటి అనేక రంగాల్లో విదేశీ సాంకేతికతను కొనుగోలు చేసి ఉపయోగిస్తున్నాం. ప్రారంభ దశలో ఇది అవసరమే అయినప్పటికీ, దీర్ఘకాలికంగా ఇది దేశ సాంకేతిక స్వావలంబనకు అడ్డంకిగా మారుతుంది. ఎందుకంటే ఏ దేశమూ తమ అత్యాధునిక సాంకేతికతను పూర్తిగా మరొక దేశానికి బదిలీ చేయడానికి సిద్ధపడదు. ఇటీవల రక్షణ రంగంలో జరిగిన కొన్ని ఒప్పందాలు కూడా ఈ వాస్తవాన్ని గుర్తు చేశాయి. సాంకేతికతను కొనుగోలు చేయడం ద్వారా ఉత్పత్తులు తయారు చేయవచ్చు. కానీ సాంకేతికతను సృష్టించడం ద్వారా మాత్రమే ప్రపంచ స్థాయిలో పోటీపడవచ్చు. మేధో సంపత్తి హక్కులు, పేటెంట్లు, పరిశోధన ఫలితాలు ఉన్న దేశాలే అధిక ఆర్థిక లాభాలు పొందుతాయి. భారతదేశం దీర్ఘకాలికంగా అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే విదేశీ సాంకేతికత వినియోగదారుడిగా కాకుండా, సాంకేతికత సృష్టికర్తగా మారాలి. వర్షాభావమైనా ఆహార భద్రతకు భరోసా ఇక్కడ మరో ముఖ్యమైన సమస్య పరిశోధన, అభివృద్ధి (ఆర్‌డిడి) రంగంలో తక్కువ పెట్టుబడులు. ప్రపంచంలోని ప్రముఖ ఆర్థిక శక్తులు తమ స్థూల దేశీయోత్పత్తిలో గణనీయమైన శాతాన్ని పరిశోధన కోసం ఖర్చు చేస్తున్నాయి.

# మెకెదాటు డ్యామ్ నిర్మాణం కుదరదు

### కావేరి డెల్టా రైతులకు తీరని నష్టం

### కర్నాటక తీరుకు నిరసనగా తమిళ అసెంబ్లీలో తీర్మానం

చెన్నై,జూన్19 : కర్ణాటక ప్రభుత్వం కావేరీ నదిపై మేకెదాటు వద్ద డ్యామ్ నిర్మాణానికి చేస్తున్న ప్రయత్నాలను తమిళనాడు ప్రభుత్వం వ్యతిరేకించింది.  మేకెదాటు డ్యామ్ నిర్మాణాన్ని తమిళనాడు ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. డ్యామ్ నిర్మాణంతో కావేరి డెల్టా రైతులకు తీవ్రనష్టం కలుగుతుందని తమిళనాడు ప్రభుత్వం ఆరోపిస్తోంది. గత నెలలో తమిళనాడు ముఖ్యమంత్రి జోసఫ్ విజయ్ ప్రధాని నరేంద్ర మోదీని కలిసిన సందర్భంగా మేకెదాటు వద్ద డ్యామ్ నిర్మాణాన్ని అడ్డుకోవాలని వినతి పత్రం సమర్పించారు. కావేరి నిర్వాహక మండలిలో సభ్యులుగా ఉన్న రాష్ట్రాల ఆమోదం లేకుండా మేకెదాటు ప్రాజెక్టును చేపట్టడానికి వీలులేదని, ఈ విషయమై కేంద్ర జలశక్తి శాఖకు, కేంద్ర నీటి వనరులకు శాఖకు ఆదేశాలివ్వాలని మోదీని కోరారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల మధ్య వివాదానికి దారి తీసిన మేకెదాటు ప్రాజెక్ట్‌పై తమిళనాడు అసెంబ్లీలో కీలక తీర్మానం జరిగింది. మేకెదాటు డ్యామ్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం ఉదయం ముఖ్యమంత్రి విజయ్ అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. కర్ణాటక ప్రతిపాదిస్తున్న ఈ ప్రాజెక్ట్ కావేరి నదీ జలాల వివాదాల ట్రిబ్యునల్ తుది అవార్డుతో పాటు.. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను పూర్తిగా ఉల్లంఘిస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పర్యావరణ, సాంకేతిక అనుమతులు సహా ప్రాజెక్టుకు సంబంధించిన ఎలాంటి అనుమతులూ ఇవ్వొద్దని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన ఈ తీర్మానానికి కాంగ్రెస్, వీసీకే, ఇతర పార్టీలు మద్దతు తెలిపాయి.

# దేశీయ మార్కెట్లో బంగారం ధరలు పతనం

### పదిగ్రాములపై 3వేలకు పైగా దిగివచ్చిన ధరలు

న్యూఢిల్లీ,జూన్19 :  దేశీయ మార్కెట్లో బంగారం, వెండి ధరలు దిగొచ్చాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతలు చల్లారడం, చమురు ధరలు పడిపోవడం వంటి పరిణామాలతో ఈ లోహాలకు డిమాండ్ తగ్గింది. దీంతో వీటి ధరలు కాస్తా తగ్గుముఖం పట్టాయి. హైదరాబాద్ మార్కెట్‌లో శుక్రవారం 24 క్యారెట్ల మేలిమి 10 గ్రాముల పుత్తడి ధర రూ. 1,49,270గా ఉంది. క్రితం రోజుతో పోలిస్తే దాదాపు రూ. 3000కు పైనే తగ్గింది. ఇక, కేజీ వెండి ధర రూ. 2.37లక్షలు పలికింది. వెండి ధర ఒక్క రోజే రూ. 8,600 తగ్గడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఈ లోహాల ధరలు దిగొచ్చాయి. ఔన్సు పుత్తడి ధర 4,139 డాలర్లు, ఔన్సు వెండి  ధర 63.85 డాలర్లుగా ఉంది. కమొడిటీ ఎక్స్ఛేంజీ మార్కెట్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ ధర రూ.  1.46 లక్షలకు పడిపోయింది. సిల్వర్ ఫ్యూచర్స్ ధర రూ. 2.30లక్షలుగా కొనసాగుతోంది. అమెరికా-ఇరాన్ యుద్ధం ముగియడం, ఫెడ్ ప్రకటనతో అంతర్జాతీయ మార్కెట్లు కోలుకున్నాయి. అటు డాలర్‌తో పోలిస్తే మన కరెన్సీ రూపాయి విలువ కూడా బలపడుతోంది. చమురు ధరలు యుద్ధం మునుపటి స్థితికి దిగొస్తున్నాయి. ఈ కారణాలు బంగారం, వెండి ధరలపై ప్రభావం చూపిస్తున్నాయని బులియన్ విశ్లేషకులు చెబుతున్నారు. అటు దేశీయంగానూ కొనుగోళ్లు తగ్గడం కూడా వీటి ధరల పతనానికి కారణమవుతున్నట్లు పేర్కొంటున్నారు.


# నల్లగొండ జిల్లాలో ఘోర ప్రమాదం

### పరసస్రం ఢీకొన్న రెండు కార్లు...ముగ్గురు మృతి

### మృతుల్లో తండ్రీ కొడుకులు

నల్లగొండ,జూన్19 : నల్లగొండ జిల్లాలోని పెద్దవూర మండలం రామన్నగూడెం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. రెండు కార్లు పరస్పరం ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో తండ్రీకొడుకులతో పాటు మరొకరు ఉన్నారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే గాయపడిన వారిని చికిత్స నిమిత్తం నాగార్జునసాగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతిచెందిన తండ్రీకొడుకులు పల్నాడు జిల్లా ముప్పల్ మండలం కాకర్లపాలెం గ్రామానికి చెందిన కాకర్ల థామస్య(51), ప్రకాష్ రావు (35)గా గుర్తించారు. మరోవ్యక్తి వరంగల్ ఎస్ఎల్‌బీసీ సైట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న సాయికుమార్(20)గా పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ముగ్గురి మృతితో వారి కుటుంబాల్లో విషాదఛాయలు అలముకున్నాయి.

# దుష్టులతో స్నేహం



ఆధ్యాత్మికం

బైబిల్ కథా ఘట్టాల్లో కనాను అనే ప్రాంతానికి చాలా ప్రాధాన్యం ఉంది. అయితే యాకోబు కాలానికి అది భ్రష్టమైపోయింది. అక్కడి ప్రజలు అబద్ధపు దేవుళ్లను ఆరాధించేవారు. ఆలుమగల బంధాలు పటాపంచలయ్యాయి. ఈ నేపథ్యంలో యాకోబు గానీ, అతని సంతానం గానీ కానాను ప్రాంతంలో తిరగడానికే ఇష్టపడేవారు కాదు. అయితే యాకోబు గారాలపట్టి దీనా మాత్రం ఆ ప్రాంత యువతులతో పరిచయం పెంచుకుంది. ఒకరోజు అక్కడి వాళ్లను పలకరించడానికి వెళ్లింది. అక్కడే ఉన్న షెకెము అనే వ్యక్తి దీనాను బలవంతం చేయబోయాడు. విషయం తెలిసిన దీనా పన్నెండు మంది సోదరులు.. షెకెము ఉన్న పట్టణంపై అకస్మాత్తుగా దాడి చేశారు. షెకెమును, అతని సోదరులను, ఇతర పురుషులందరినీ చంపేశారు. తన కుమారులు అలా చేసినందుకు యాకోబుకు చాలా కోపం వచ్చింది. ఈ కష్టమంతా ఎలా మొదలైంది? దీనా దేవుని నియమాలను పాటించని ప్రజలతో సావాసం చేయడం మూలంగానే ఇదంతా జరిగిందని ఆయన అభిప్రాయపడ్డాడు. కాబట్టి, మనం స్నేహితులను ఎంచుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. దుష్టులతో స్నేహం వల్ల కలిగే నష్టాలు పూడ్చుకోలేమని గుర్తెరగాలి.

# జూలపల్లిని అభివృద్ధి బాటలో నడిపిస్తున్న సర్పంచ్ వనిత సాయికుమార్

**-పార్టీలకు అతీతంగా ప్రజల ఆశీర్వాదంతో జూలపల్లి అభివృద్ధి**

**-ప్రజల ఆశీర్వాదంతో గ్రామాభివృద్ధికి అంకితమైన నాయకత్వం**



ది క్రైమ్ న్యూస్ /పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్, జూన్ 19 : ప్రజల సంక్షేమమే ధ్యేయంగా, పార్టీలకు అతీతంగా గ్రామాభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగుతున్న నాయకత్వానికి జూలపల్లి గ్రామ సర్పంచ్ పోలుదాసరి వనిత సాయికుమార్ నిదర్శనంగా నిలుస్తున్నారు. పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం జూలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గత ఆరు నుంచి ఏడు నెలలుగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు గ్రామ ప్రజల ప్రశంసలు అందుకుంటున్నాయి. గ్రామంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలనే సంకల్పంతో సర్పంచ్ వనిత సాయికుమార్ శుక్రవారం అంబేద్కర్ నగర్‌లోని అంగన్‌వాడీ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన బోరు మోటారును, అలాగే పెద్ద చెరువు కట్ట సమీపంలోని ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన మరో బోరు మోటారును ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామ ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారు. గ్రామాభివృద్ధి విషయంలో సర్పంచ్ వనిత సాయికుమార్ ప్రత్యేక చొరవ చూపుతున్నారు. గ్రామంలో కొత్త బోర్లు ఏర్పాటు చేయడం, వారపు సంత అభివృద్ధి, ప్రధాన రహదారులు, అంతర్గత వీధుల పరిశుభ్రత, మురుగునీటి కాలువల శుభ్రపరిచే పనులు నిరంతరం కొనసాగుతున్నాయి. తాగునీటి కొరత లేకుండా చర్యలు చేపట్టడమే కాకుండా, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. అదేవిధంగా విద్యుత్ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ, గ్రామ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. గ్రామంలో మరణించిన కుటుంబాలకు అవసరమైన సహాయం అందించడం, పారిశుద్ధ్య కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించడం ద్వారా ప్రజలతో మమేకమవుతున్నారు. సర్పంచ్ వనిత సాయికుమార్ నాయకత్వంలో గ్రామం అభివృద్ధి పథంలో దూసుకుపోతుండటంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల అవసరాలను గుర్తించి వెంటనే స్పందించే నాయకురాలిగా ఆమె గుర్తింపు పొందుతున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గడ్డం రాజమహేందర్, పంచాయతీ కార్యదర్శి గుమ్మడి సదయ్య, వార్డు సభ్యులు ఇరుగురాల రమేష్, బొల్లంపల్లి సంతోష్ కుమార్, స్థానిక మహిళలు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# త్యాగాల కుటుంబం రాహుల్ గాంధీ కుటుంబం

**ధర్మపురిలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు.**

**హాజరైన మంత్రి అడ్లూరి.**




ధర్మపురి, జూన్ 19, (ది క్రైమ్ న్యూస్): : దేశం కోసం ప్రాణాలర్పించిన కుటుంబం రాహుల్ గాంధీ కుటుంబం అని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్మపురి లోని నంది చౌరస్తాలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ దేశ సమగ్రత, ఐక్యత కోసం రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు పాదయాత్ర నిర్వహించారని మంత్రి అడ్లూరి అన్నారు. దేశం కోసం రాహుల్ గాంధీ కుటుంబం ప్రాణత్యాగాలు చేశారని మంత్రి లక్ష్మణ్ కుమార్ గుర్తు చేశారు. దేశానికి ప్రధాన మంత్రి అయ్యే అవకాశం వచ్చిన సోనియాగాంధీ, రాహుల్ గాంధీ గారు ప్రధాన మంత్రి పదవి చేపట్టకుండా ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్ ను ప్రధాని మంత్రి చేశారని మంత్రి అడ్లూరి అన్నారు. ప్రధానమంత్రి మోడీ పేదలకు అన్నం పెట్టే ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి అడ్లూరి అన్నారు. డిల్లీ శివారులో రైతులు మద్దతు ధర కోసం ధర్నా చేస్తే రైతులపై జీను ఎక్కించిన ప్రభుత్వం బీజేపీ ప్రభుత్వం అని మంత్రి అన్నారు. ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా దేశ ఐక్యత కోసం రాహుల్ గాంధీ పని చేస్తున్నారని 2029లో రాహుల్ గాంధీని ప్రధాని మంత్రిగా చూడాలని ఇందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, తిరుపతి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నర్సాపూర్‌లో వైభవంగా శ్రీ పెద్దమ్మతల్లి బోనాల పట్నాల మహోత్సవం

**అమ్మవారిని దర్శించుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నల్ల మనోహర్ రెడ్డి**





సుల్తానాబాద్, జూన్ 19 (ది క్రైమ్ న్యూస్) : పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలోని ఎలిగేడు మండలం నర్సాపూర్ గ్రామంలో శ్రీ పెద్దమ్మతల్లి బోనాల పట్నాల మహోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామస్తులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నల్ల మనోహర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు , అర్చనలు నిర్వహించారు. అనంతరం మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగను గ్రామస్తులంతా కలిసికట్టుగా జరుపుకోవడం సంతోషకరమన్నారు. ఈ మహోత్సవంలో భాగంగా మహిళలు సాంప్రదాయబద్ధంగా బోనాలను నెత్తిన ఎత్తుకుని ఆలయానికి తరలివచ్చి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు , భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ పరిసరాలన్నీ భక్తుల కోలాహలంతో, ఆధ్యాత్మిక శోభతో సంతరించుకున్నాయి.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

**- కల్వచర్ల ప్రభుత్వ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం**

రామగిరి, జూన్ 19(ది క్రైమ్ న్యూస్) : – రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామ సర్పంచ్ రేండ్ల శారద–కుమారస్వామి, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చేతుల మీదుగా చిన్న పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని చెప్పారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన తల్లిదండ్రులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అందరూ ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు సరళ,వేణుగోపాల్ ఇతర ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నూతన జెసిపిని ప్రారంభించిన మున్సిపల్ చైర్ పర్సన్ సుజాత





మధిర ది క్రైమ్ న్యూస్ ప్రతినిధి జూన్ 19:లి మధిర పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత పేర్కొన్నారు. నగర అభివృద్ధి పథకంలో భాగంగా మున్సిపాలిటీకి నూతనంగా మంజూరైన (జేసీబీ) వాహనాన్ని శుక్రవారం మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత రిబ్బన్ కట్ చేసి, కొబ్బరికాయ కొట్టి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ. పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ, డ్రైనేజీల పూడికతీత, రహదారుల మరమ్మతులు మరియు ఇతర అత్యవసర అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేసేందుకు ఈ నూతన జేసీబీ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు మున్సిపల్ వాహన శ్రేణిని ఆధునీకరిస్తున్నామని, పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు కౌన్సిల్ మరియు అధికారులు సంయుక్తంగా కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రజల సౌకర్యార్థం చేపడుతున్న ఈ అభివృద్ధి పనులకు పట్టణ ప్రజలు, వార్డు కౌన్సిలర్లు పూర్తి సహకారం అందించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కోన ధని కుమార్ మున్సిపల్ కమిషనర్ సామ్యూల్ బెనిడిక్ట్ ఇస్రాయిల్ పాల్ గారు, 1వ వార్డు కౌన్సిలర్ డి.శిరీష గారు, 2వ వార్డు కౌన్సిలర్, 5వ వార్డు కౌన్సిలర్, 6వ వార్డు కౌన్సిలర్, 7వ వార్డు కౌన్సిలర్, 8వ వార్డు కౌన్సిలర్ వై.కోటేశ్వరరావు 9వ వార్డు కౌన్సిలర్ వై.చారులత 10వ వార్డు కౌన్సిలర్ బి.రేవతి, 11వ వార్డు కౌన్సిలర్ జి.మాధురి 12వ వార్డు కౌన్సిలర్ యం.నాగలక్ష్మి 13వ వార్డు కౌన్సిలర్ ఎస్కే. రషీదున్ 14వ వార్డు కౌన్సిలర్ ఎస్.వెంకట్రావు 15వ వార్డు కౌన్సిలర్ ఎన్.రాజేశ్వరి 16వ వార్డు కౌన్సిలర్ వి.వెంకట నాగేశ్వరరావు 17వ వార్డు కౌన్సిలర్ వి.వినయ్ కుమార్ 19వ వార్డు కౌన్సిలర్ వై.వెంకట అప్పారావు 20వ వార్డు కౌన్సిలర్ బి.విజయకుమారి 21వ వార్డు కౌన్సిలర్ ఆర్.రూప 22వ వార్డు కౌన్సిలర్ డి.నాగార్జున మున్సిపల్ అధికారులు, సిబ్బంది స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# వేపాకుల బతుకమ్మ.. ఉయ్యాల పాటలతో కూలీల ప్రార్థన.

**20 రోజులుగా చినుకు జాడలేదు. వేపాకులతో బతుకమ్మ.**

**ఉయ్యాల పాటలతో వాన దేవుణ్ణి వేడుకున్న ఉపాధి హామీ కూలీలు.**

**గూడెం గ్రామంలో భావోద్వేగ దృశ్యం.**



వానలు కురిసి పంటలు పచ్చగా కళకళలాడాలని కోరుతూ పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం గూడెం గ్రామానికి చెందిన గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలు వినూత్నంగా ప్రార్థనలు నిర్వహించారు. వంద రోజుల ఉపాధి పనులు ముగించుకున్న అనంతరం మహిళా కూలీలందరూ చెట్టు కింద చేరి వేపాకులను బతుకమ్మ రూపంలో పేర్చి ఉయ్యాల పాటలు పాడుతూ వానదేవున్ని వేడుకున్నారు. గ్రామంలో రైతులందరూ పత్తి విత్తనాలు నాటి దాదాపు 20 రోజులు గడుస్తున్నప్పటికీ ఇప్పటి వరకు సరైన వర్షాలు కురవకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. చినుకు జాడ కూడా కనిపించకపోవడంతో పంటల భవితవ్యంపై గ్రామస్తుల్లో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో మహిళా కూలీలు సంప్రదాయ పద్ధతిలో వర్షాలు కురవాలని కోరుతూ ప్రత్యేకంగా ప్రార్థనలు చేశారు. "వానలు లేకపోతే పంటలు ఎండిపోతాయి.. రైతు బతుకు కష్టమవుతుంది" అంటూ మహిళలు ఉయ్యాల పాటలు పాడుతూ వర్షదేవుడి కరుణ కోసం ప్రార్థించారు. గ్రామీణ సంస్కృతి, సంప్రదాయ విశ్వాసాలకు ప్రతీకగా నిలిచిన ఈ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. వాతావరణ పరిస్థితులు అనుకూలించి త్వరలోనే మంచి వర్షాలు కురవాలని రైతులు, కూలీలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రైతుల ఆశలు నెరవేరి పంటలు సస్యశ్యామలంగా మారాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు. "వాన వస్తేనే రైతు ముఖంలో చిరునవ్వు... అదే చిరునవ్వు కోసం గూడెం మహిళల ప్రార్థన." నెరవేరాలని కోరుకుందాం.

# ఉపాధి కూలీలకు అన్నదానం.. పనిచోటే బీరప్ప ప్రసాదం

**పని ప్రదేశానికే చేరిన బీరప్ప ప్రసాదం.**

**ఆదర్శంగా నిలిచిన అన్నదానం.**



పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం గూడెం గ్రామంలో గొల్ల, కురుమల ఆరాధ్య దైవమైన బీరప్ప స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తుల, గ్రామస్తుల కోసం మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మహోత్సవం అనంతరం ఆలయంలో సిద్ధం చేసిన ఆహార పదార్థాలను గ్రామంలోని ఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్న ప్రదేశానికి తీసుకువెళ్లి వారికి అందించారు. ఎండలో శ్రమిస్తున్న కూలీలకు సమయానికి భోజనం అందించడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు. రోజంతా ఉపాధి పనుల్లో నిమగ్నమైన కూలీలు పని ముగించుకున్న తర్వాత ఒకేచోట చేరి సామూహికంగా భోజనం చేశారు. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు స్వయంగా కూలీలకు వడ్డిస్తూ ఆతిథ్యం అందించారు. గ్రామీణ ప్రాంతాల్లో శ్రమజీవుల పట్ల గౌరవాన్ని చాటుతూ నిర్వహించిన ఈ కార్యక్రమం స్థానికుల ప్రశంసలు అందుకుంది. ఆలయ మహోత్సవాన్ని సామాజిక సేవతో ముడిపెట్టి ఉపాధి హామీ కూలీలకు అన్నదానం చేయడం ఆదర్శప్రాయమని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. బీరప్ప స్వామి ఆశీస్సులతో గ్రామంలో సుఖశాంతులు, సమృద్ధి నెలకొనాలని భక్తులు ప్రార్థించారు. అదే సమయంలో కూలీల శ్రమకు విలువనిస్తూ వారికి పని చేస్తున్న చోటులోనే అన్నదాన సేవ చేయడం కార్యక్రమానికి మరింత విశిష్టతను తీసుకొచ్చింది. "దేవుడికి చేసిన సేవ ఎంత గొప్పదో... శ్రమజీవికి పెట్టిన అన్నం అంతకంటే గొప్పది". అన్న మాటను నిరూపించుకున్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి 7 రోజుల జైలు

**రామగుండం ట్రాఫిక్ సీఐ బి. రాజేశ్వరరావు వెల్లడి**

**ప్రిన్సిపల్ కోర్టు మేజిస్ట్రేట్ వెంకట్ సచిన్ రెడ్డి తీర్పు**




గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్) : డ్రంక్ అండ్ డ్రైవ్ లో ఒకరికి 7 రోజుల జైలు శిక్ష పడినట్లు రామగుండం ట్రాఫిక్ సీఐ బి. రాజేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మొత్తం 6 మంది పట్టుబడ్డారు. వీరిని గోదావరిఖని ప్రిన్సిపల్ కోర్టు మేజిస్ట్రేట్ వెంకట్ సచిన్ రెడ్డి ముందు హాజరుపరిచారు. కేసును విచారించిన మేజిస్ట్రేట్ ఐదుగురు వాహనదారులకు కలిపి 55000 రూపాయల ఫైన్ విధించారు. మరొక వ్యక్తికి 7 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. కోర్టు ఆదేశాల మేరకు సదరు వ్యక్తిని కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ బి. రాజేశ్వరరావు మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా సరైన పత్రాలు కలిగి ఉండాలని, టూ వీలర్ వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ పెట్టుకోవాలని చెప్పారు. రాంగ్ రూట్ లో వెళ్లేవారిపై చర్యలు ఉంటాయని, అతివేగం ప్రమాదకరమని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ట్రాఫిక్ సీఐ బి. రాజేశ్వరరావు కోరారు.

# మధిర ప్రభుత్వ హాస్పటల్ ను తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్



మధిర ది క్రైమ్ న్యూస్ ప్రతినిధి జూన్ 19: మధిర మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డ్ ఎంప్లాయిస్ కాలనీలో గల ప్రభుత్వ ప్రాంతీయ హాస్పటల్ ను శుక్రవారం నాడు అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడున్న వైద్య సదుపాయాలను పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు నాణ్యమైన వైద్యాన్ని ప్రజలకు అందించాలని సూచించారు. 100 పడకల ఆసుపత్రిలో ల్యాబ్ కు అవసరమైన పరికరాలను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేశారు.

# సుల్తానాబాద్‌లో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



సుల్తానాబాద్, జూన్ 19 (ది క్రైమ్ న్యూస్) : కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం ఘనంగా సంబరాలు నిర్వహించారు. పట్టణంలోని నెహ్రూ విగ్రహం ఎదుట ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ మాట్లాడుతూ.. దేశ ప్రజల కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటం అందరికీ ఆదర్శనీయమని కొనియాడారు. ఆయన మరిన్ని పుట్టినరోజులు జరుపుకుంటూ ప్రజాసేవలో ముందంజలో ఉండాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణతో పాటు వైస్ చైర్మన్ అంతటి పుష్పలత, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ధనాయక్ దామోదర్ రావు, ముఖ్య నాయకులు వేగోళం అబ్బయ్య, స్థానిక కౌన్సిలర్లు, పార్టీ కార్యకర్తలు , రాహుల్ గాంధీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## గౌడ సంఘం అధ్యక్షుని సన్మానించిన వాకర్స్

రామగిరి, జూన్ 19(ది క్రైమ్ న్యూస్):మంథని పట్టణంలోని కల్లుగీత కార్మిక ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన వాకర్స్ సభ్యుడు మాచిడి వీర శంకర్ గౌడ్ ను ఘనంగా సన్మానించారు. శుక్రవారం ప్రభుత్వ కళాశాల మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాచిడి వీర శంకర్ గౌడ్ ను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అంకరి కుమార్ ప్రధాన కార్యదర్శి నాంపల్లి రమేష్, ఉపాధ్యక్షులు వేల్పుల గట్టయ్య, వాకర్స్ ముఖ్య సలహాదారులు కొమురోజు శ్రీనివాస్, రావికంటి మనోహర్ కారు శ్రీనివాస్, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పోతరాజు సమ్మయ్య, సహాయ కార్యదర్శి గంధం అంజి బాబు, లెక్చరర్ రావుల తిరుమల్, తాటి సమ్మయ్య గౌడ్, రంగు రవి, కొమురోజు వేణు డిష్ రవి, ఇసంపెల్లి కొమురయ్య, బ్యాంక్ సతీష్, గుడిమల్ల కుమార్, ఒల్లాల వెంకన్న తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డలకు ఆత్మీయ ఆహ్వానం..

**- తల్లిగారి ఇంటిలా రాజగృహా**

**- సహపంక్తి బోజనం...పుట్టింటి చీర సారే...**

రామగిరి, జూన్19(ది క్రైమ్ న్యూస్):–నీత్యం పేద వర్గాల కోసం అహర్నిశలు పని చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ నివాస గృహమైన రాజగృహా ఆడబిడ్డలకు తల్లిగారి ఇంటిలా మారింది. మహాముత్తారం మండలం మీనాజిపేట గ్రామానికి చెందిన పలువురు ఆడబిడ్డలు శుక్రవారం రాజగృహాకు రాగా వారికి పుట్ట మధూకర్ శైలజ దంపతులు ఆత్మీయ ఆహ్వానం పలికారు. వారి యోగ క్షేమాలు తెలుసుకున్న అనంతరం వారితో కలిసి సహపంక్తి బోజనం చేశారు. మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ వారికి ఆత్మీయంగా వడ్డించారు. అనంతరం పుట్టింటి చీరే సారేలు అందజేశారు. మంథనికి వచ్చిన తమకు ఇంతలా ఆత్మీయత పంచిన పుట్ట దంపతులను ఏనాడు మర్చిపోమని, తమ పుట్టింటికి వచ్చినట్లు ఉందంటూ సదరు మహిళలు ఆనందం వ్యక్తం చేశారు.

## బీఎల్ఏ సమావేశం విజయవంతం చేయండి...

**- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**



రామగిరి, జూన్ 19(ది క్రైమ్ న్యూస్):– ఈ నెల 24న తలపెట్టిన బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని రాజగృహాలో భీఆర్ఎస్ పార్టీ మండల కోఆర్డినేటర్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్ఐఆర్ పార్టీ సభ్యత్వ నమోదు పై ,24న మంథని పట్టణంలోని ఎస్ఎల్బీ గార్డెన్ లో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఈ సమావేశానికి పెద్ద ఎత్తున పార్టీశ్రేణులు, అభిమానులు హాజరై విజయవంతంగా చేయాలని ఆయన కోరారు.

## ఉపాధ్యాయుల ఔదార్యం.. విద్యార్థికి ఆపరేషన్



రామగిరి, జూన్ 19(ది క్రైమ్ న్యూస్):– రామగిరి మండలం రత్నాపూర్ గ్రామం రాంనగర్ (సెంటినరీ కాలనీ) ప్రభుత్వ పాఠశాల 2వ తరగతి విద్యార్థిని రెవెల్లీ భానుశ్రీ (7) కు కాలు ఆపరేషన్ చేయించి ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆదర్శంగా నిలిచారు. గోడ మీద నుండి చిన్నారి భానుశ్రీ పడగా కాలు, పాదం నుజ్జు నుజ్జు అయ్యింది.దీంతో ఫైనల్ ఆపరేషన్ కు హెచ్ఎం మారపల్లి ఈశ్వరమ్మ, ఇక్కడ గతంలో పని చేసిన ఉపాధ్యాయురాలు మోత్కురి సుభాషిణి(మొగల్ పహాడ్) లు తోటి ఉపాధ్యాయుల సహకారం తో రూ.95,100 లు జమచేసి ఆపరేషన్ చేయించారు.ఈ మేరకు శుక్రవారం స్థానిక సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు, పాఠశాల హెచ్ఎం మారపల్లి ఈశ్వరమ్మ చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బత్తిని ప్రశాంత్,పున్నం మణి తేజ, అల్లి రమేష్, కార్యదర్శి గంగుల సంతోష్, మాజీ వార్డు సభ్యుడు బొంగరాల రవి లు పాల్గొన్నారు.

## త్రాగునీటి సమస్య తీర్చడమే ధ్యేయం.

**-జూలపల్లి సర్పంచ్ పోల్ దాసరి వనిత- సాయికుమార్**



రామగిరి,జూన్ 19(ది క్రైమ్ న్యూస్):–జూలపల్లి గ్రామ ప్రజలకు త్రాగునీటి సమస్య లేకుండా చేయడమే ధ్యేయం అని జూలపల్లి సర్పంచ్ పోల్ దాసరి వనిత సాయికుమార్ అన్నారు. కమాన్ పూర్ మండలం జూలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో అంబేద్కర్ నగర్ లోని అంగన్వాడి స్కూల్ వద్దబోరు మోటర్ మరియు పెద్ద చెరువు కట్ట ఓ హెచ్ ఎస్ ఆర్ ట్యాంక్ వద్దా బోరు మోటర్ జూలపల్లి సర్పంచ్ పోలుదాసరి వనిత సాయికుమార్ ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. ప్రజల దాహార్తిని దృష్టిలో పెట్టుకొని త్రాగునీటి సమస్య ఉన్న చోట బోర్ వేసి మోటర్ బిగించడం జరిగిందని. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గడ్డం రాజమహేందర్ పంచాయతీ కార్యదర్శి గుమ్మడి సదయ్య వార్డు సభ్యులు ఇరుగురాల రమేష్ బొల్లంపల్లి సంతోష్ కుమార్ స్థానిక మహిళలు యువకులు పాల్గొనడం జరిగింది.

## జమ్మికుంట పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు ?

జమ్మికుంట జూన్ 19 (ది క్రైమ్ న్యూస్) : జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు అధికారులను డిమాండ్ చేస్తున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే జమ్మికుంట పట్టణ కేంద్రంలో నిర్మాణ దశలో జి ప్లస్ పర్మిషన్ తీసుకొని కొంతమంది ఇంటి యజమానులు నిబంధనలను తుంగలో తొక్కి ప్రభుత్వానికి ఆదాయానికి గండికొడుతూ మూడు అంతస్తులు నాలుగు అంతస్తులు నిర్మిస్తున్నా కానీ మున్సిపాలిటీ అధికారులు,సిబ్బంది ఎందుకు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని పలువురు చర్చించుకుంటున్నారు. విచ్చలవిడిగా నిర్మాణాలు చేపడుతున్నా కానీ మున్సిపల్ అధికారులు స్థానిక టౌన్ ఫాలింగ్ అధికారి ఇన్చార్జి కావడంతోనే ఇలాంటి అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయా? లేక అధికారులు ఇంటి యజమానులతో కుమ్మక్కై ఈ విధంగా నిర్మాణాలు చేపడుతున్నారా? అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్, చైర్మన్, టౌన్ ప్లానింగ్ అధికారులు ఇలాంటి నిర్మాణం పైన ఉక్కు పాదం మోపితే తప్ప అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయలేరని, ప్రభుత్వ ఆదాయాన్ని పెంచిన వారవుతారని పలువురు చర్చించుకుంటున్నారు.

## ప్రైవేట్ స్కూల్ బస్సులను పూర్తిస్థాయిలో ఫిట్ నెస్ తనిఖీలు నిర్వహించాలి

**రవాణా శాఖ అధికారి శ్రీనివాస్‌కి వినతి పత్రం అందజేసిన పిడిఎస్‌యు ఖమ్మం జిల్లా నాయకులు**




ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : ఖమ్మం జిల్లా వ్యాప్తంగా జూన్ 15 నుండి విద్యాసంస్థలు పున ప్రారంభం అయినవి. ఈ సందర్భంగా ప్రైవేట్ , కార్పొరేట్ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులను వారిని ఇంటికి నుండి పాఠశాల వరకు తరలించే విద్యార్థుల స్కూల్ బస్సులను పూర్తిస్థాయిలో ఫిట్ నెస్ తనిఖీలు నిర్వహించాలని. భద్రత ప్రమాణాలు పాటిస్తూ బస్సులు మాత్రమే ఫిట్ నెస్ సర్టిఫికెట్లు జారీ చేయాలని, పి డి ఎస్ యు విద్యార్థి సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు తిప్పారపు.లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు ఖమ్మం జిల్లా ఆర్ టి ఓ కార్యాలయంలో జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ కి వింత పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఉన్న ప్రైవేట్ విద్యాసంస్థల స్కూల్ బస్సులను పూర్తిస్థాయిలో ఫిట్ నెస్ తనిఖీలు నిర్వహించి. అనుమతులు లేని, ప్రభుత్వ నిబంధనలకు ఉల్లంఘించి నడుపుతున్న స్కూల్ బస్సుల పైన కఠినమైన చర్యలు తీసుకొని వాటిని సీజ్ చేయాలని వారు కోరారు. గతంలో ఫిట్ నెస్ లేని బస్సుల వల్ల అనేక సంఖ్యలో బస్ యాక్సిడెంట్లకు గురయ్యాయని వారు గుర్తు చేశారు. విద్యార్థుల తరలిస్తున్న బస్సులపై నిర్లక్ష్యం వహిస్తే వారిని తరలించే సందర్భంలో ఏదైనా జరగరానిది జరిగితే విద్యార్థులు నష్టానికి గురవుతారని వారు తెలిపారు. అదేవిధంగా సిట్టింగ్ పరిమితికి మించి విద్యార్థుల్ని తరలిస్తున్న బస్సులను గుర్తించి వాటిపైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. స్కూల్ బస్సులో ఫిట్ నెస్ విషయంలో ఆ బస్సుల యొక్క బ్రేక్స్, టైర్స్, ఎమర్జెన్సీ డోర్ ఓపెనింగ్, అదేవిధంగా ఎమర్జెన్సీ మెడికల్ కిట్ ఇటువంటి సంబంధించిన విషయంలో పూర్తిస్థాయిలో పరివేక్షించాలి. విద్యార్థుల ప్రయాణిస్తున్న ఆ స్కూల్ బస్సు నడిపే డ్రైవర్లను అవగాహనను కల్పించాలి. స్కూల్ బస్ నడిపే డ్రైవర్లు డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన నడిపితే పూర్తి స్థాయిలో యాజమాన్యం, డ్రైవర్ బాధ్యత వహిస్తారని ఆర్టీవో అవగాహన కల్పించాలి. భద్రత ప్రమాణాలు పాటిస్తున్న స్కూల్ బస్సుల కు మాత్రమే ఫిట్ నెస్ సర్టిఫికెట్ జారీ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సందీప్, హరి, ప్రణవ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్ణీత గడువు లోపు అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**



ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ): ఖమ్మం రూరల్ మండల పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వేగవంతంగా, నియమిత గడువు లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. శుక్రవారం పాలేరు నియోజకవర్గం పరిధిలో జిల్లా కలెక్టర్ పర్యటించారు. ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లి లో 108 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాయ్స్, గర్ల్స్ హాస్టల్ భవనాలు, ప్రధాన భవనం, అకాడమిక్ బ్లాక్ నిర్మాణాల పనుల పురోగతిని పరిశీలించారు. కార్మికులను పెంచి అనుసంధానంగా పనులు పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం పొన్నేకల్ లో చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ ప్రాంతాలను తిరుగుతూ, పనుల నాణ్యతను, భవనాల నమునా మ్యాప్ లను పర్యవేక్షించి అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. యంగ్ ఇండియా సమీకృత గురుకులాల వద్ద లింక్, అంతర్గత రోడ్డు, ప్రణాళిక ప్రకారం 4 జూనియర్, 9 సీనియర్ హాస్టల్ బ్లాకులు, వెయిటింగ్ హాల్, అకాడమిక్ బ్లాక్ భవనాల నిర్మాణంకు కార్మికులకు అత్యధికంగా పెంచి, పనులను త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా రంగం అభివృద్ధిని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని ముందుకు సాగుతున్నదని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన ఉన్నత విద్య, మెరుగైన ఉపాధి కోర్సులను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని అన్నారు. జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణం పూర్తయితే స్థానిక యువతకు సాంకేతిక విద్య అందుబాటులోకి వచ్చి, వారి భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతుందని అన్నారు. అదే విధంగా యంగ్ ఇండియా స్కూల్ పూర్తి కావడంతో పరిసర ప్రాంతాల విద్యార్థులకు మంచి విద్య అవకాశాలు అందుతాయని తెలిపారు. పనుల నాణ్యతపై ఎటువంటి రాజీ ఉండకూడదని, ప్రతి దశలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో ఆలస్యం లేకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన వనరులు సమకూర్చుకుని, నిర్ణీత గడువులోపే పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ఇంజనీరింగ్ అధికారి బుగ్గయ్య, ఖమ్మం రూరల్ మండల తహసీల్దారు యం. వినయేందర్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నరేంద్రమోదీ వల్లే దేశం సురక్షితంగా ఉంది

**సేంద్రియ వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలి..**

**నిత్యం ఏదోఒక రూపంలో శరీరంలోకి కెమికల్స్..**

**వ్యవసాయంలో రసాయనాల వాడకాన్ని తగ్గించాలి - బిజెపి నేత నల్లా మనోహరరెడ్డి**



పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : పన్నెండేళ్ళుగా దేశాన్ని సురక్షితంగా, సుభిక్షంగా ఉంచడంలో ప్రధాని నరేంద్రమోదీ ఎనలేని కృషి చేస్తున్నారని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నల్లా మనోహరరెడ్డి అన్నారు. వికసిత్ భారత్ జిల్లా కన్వీనర్ శివంగారి సతీష్ ఆద్వర్యంలో నందనా గార్డెనులో శుక్రవారం జరిగిన సేంద్రియ వ్యవసాయం రైతు అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన నల్లా మాట్లాడుతూ, రసాయనిక ఎరువులు, యూరియా తదితర పురుగుల మందులు వాడకుండా సాంప్రదాయ పద్ధతిలో పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. నిత్యం ఏదోఒక రూపంలో కెమికల్స్ మనిషి శరీరంలోకి చేరుతున్నాయని, పంటల ఎదుగుదలకు వాడుతున్న వివిధ రకాల రసాయనాల వాడకమే ఇందుకు కారణమన్నారు. వాటి ప్రభావం వల్ల మనిషి క్యాన్సర్ వంటి భయంకర రోగాల భారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాగంగా భారత ప్రభుత్వం సేంద్రియ పంటల సాగుకు అధిక ప్రాధాన్యతను ఇస్తుందన్న ఆయన, సేంద్రియ పంటల సాగుకు తగిన అవగాహన, ప్రోత్సాహకాలను కేంద్ర ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. జిల్లాలో సేంద్రియ పంటల సాగు చేసే రైతుకు తమవంతు సహాయ సహకారాలు అందించడానికి సిద్దంగా ఉన్నామని మనోహరరెడ్డి ప్రకటించారు. తానుసైతం రైతునేనని తమ భూమిలో మొత్తం సేంద్రియ సాగు జరుగుతోందని వివరించారు. అనంతరం సేంద్రియ పంటలను సాగు చేస్తున్న రైతులను సన్మానించారు. ఆదర్శరైతు ఎర్రం మల్లారెడ్డి, జిల్లా ఆర్గానిక్ మాస్టర్ పెర్కపల్లి సుధాకర్, ప్రకృతి వ్యవసాయ రైతు పాఠకుల భూమయ్య, వర్మిల్ల మొఘిలి, కట్కూరి లావణ్య తదితరులను సన్మానించారు. ఈ సదస్సులో బిజెపి నేతలు రామగిరి అఖిల్, పెంజర్ల రాకేష్, మంథెన క్రిష్ణ, గనెబోయిన రాజేందర్, గుడ్ల సతీష్, అనిల్, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుబంధు రాక రైతుల గోస

**ప్రజా సమస్యల కంటే డిప్యూటీ సీఎం కి కమిషన్ల పైనే శ్రద్ధ**

**మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్**



మధిర ది క్రైమ్ న్యూస్ ప్రతినిధి జూన్ 19: మధిర బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ జడ్పీ చైర్మన్ నియోజకవర్గ ఇన్చార్జి లింగాల కమల్ రాజ్ మాట్లాడుతూ రైతుబంధు రాక రైతులు గోస పడుతున్నారని గతంలో కేసీఆర్ పాలనలో రైతులకు టంచన్గా రైతు బందు వారి ఖాతాల్లో టింగ్ టింగ్ అంటూ సమయానికి వచ్చాయి అని ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇవ్వటం చేతకావడం లేదని, డిప్యూటీ సీఎం బట్టికి ప్రజా సమస్యల కంటే కమిషన్ల మీద శ్రద్ధ ఎక్కువైందని రైతులపై పట్టింపు లేదని విమర్శించారు, అలాగే ఈనెల 22వ తారీఖున దెందుకూరు గ్రామంలోని శ్రీరస్తు ఫంక్షన్ హాల్లో మధిర నియోజకవర్గం స్థాయిలో పార్టీ నియమించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ ఐ ఆర్ కొరకు నియమించిన బిఎల్ఎ బూత్ లెవెల్ ఏజెంటు మరియు బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కొరకు పార్టీ నియమించిన సమన్వయకర్తల కు శిక్షణ సమావేశం ఏర్పాటు చేశామని ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జ్ తక్కెళ్ళపల్లి రవీందర్రావు సభ్యత్వ మధిర నియోజకవర్గం ఇంచార్జ్ నామ నాగేశ్వరరావు, ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షులు తాత మధు మాజీ మంత్రివర్యులు పువ్వాడ అజయ్ తదితరులు పాల్గొంటారని ఈ సమావేశాన్ని కార్యకర్తలు నాయకులు అభిమానులు నియమించబడిన బిఎల్ఏ, సభ్యత్వ నమోదు సమన్వయకర్తలు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు, ఈ కార్యక్రమంలో బిక్కి కృష్ణ ప్రసాద్ పల్లపోతు వెంకటేశ్వరరావు రావూరి శ్రీనివాసరావు చిత్తారు నాగేశ్వరరావు వంకాయలపాటి నాగేశ్వరరావు రంగి శెట్టి కోటేశ్వరరావు, బొగ్గుల భాస్కర్ రెడ్డి కౌన్సిలర్ వైవి అప్పారావు మాజీ కౌన్సిలర్ దీరావత్ మాధవి, రాఘవరావు, కటికల సత్యనారాయణ రెడ్డి బొగ్గుల వీరారెడ్డి, బుర్రి బాబురావు ఐలూరి ఉమామహేశ్వర్ రెడ్డి ఆళ్ల నాగబాబు, పరిస శ్రీనివాసరావు చీదిరాల రాంబాబు వేల్పుల శివ కుర్ర రంజిత్ అబ్బూరి రామన్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు,

## పాన్ షాప్‌లలో ప్రత్యేక తనిఖీలు..




జమ్మికుంట, జూన్ 19 (ది క్రైమ్ న్యూస్) : కమిషనర్ ఆఫ్ పోలీస్ గౌస్ ఆలం ఆదేశాల మేరకు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) హుజురాబాద్ పర్యవేక్షణలో జమ్మికుంట పట్టణ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల సమీప ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. పాఠశాలలకు వంద మీటర్ల పరిధిలో ఉన్న పాన్ షాపులు, బెల్ట్ షాపులను పోలీసులు తనిఖీ చేసి, విద్యార్థులకు పొగాకు ఉత్పత్తులు, గుట్కా, సిగరెట్లు తదితర నిషేధిత వస్తువుల విక్రయాలు జరగకుండా వ్యాపారులకు సూచనలు చేశారు. పాఠశాలల పరిసర ప్రాంతాల్లో చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత దృష్ట్యా విద్యాసంస్థల సమీపంలో నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, పాఠశాలల వద్ద అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు ప్రజలకు సూచించారు. ఈ తనిఖీల్లో జమ్మికుంట పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్, ఎస్సై రవి తో పాటు రైటర్ యాకూబ్ స్థానిక పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత శ్రీ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ): ఏఐసిసి అగ్రనేత, పార్లమెంటు ప్రతిపక్షనేత శ్రీ రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక మంత్రి వర్యులు శ్రీ తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయం నందు ఖమ్మం అర్బన్ డిసిసి అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం నాయకులు సమక్షంలో కేక్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ దేశంలో బిజెపి అనుసరిస్తూన్న పలు ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న ఏకైక నాయకుడు రాహుల్ గాంధీ అని తెలిపారు. అడుగడుగునా ఎన్ని ఇబ్బందులు గురిచేసిన వెనకడుగు వేయ ప్రజా గొంతుకని తెలపడం జరిగింది. రాహుల్ గాంధీ ఈ దేశానికి కాబోయే ప్రధాని అని ,ఆయన నాయకత్వంలో దేశం అభివృద్ధి దిశగా పయనించేందుకు సిద్ధంగా ఉందని నేతలు పునరుద్ఘాటించారు. ఆ భగవంతుడు ఆయనకు మంచి ఆరోగ్యం,ఆయుషు ఇవ్వాలని తెలిపారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాపాలన లో అనేక సంక్షేమ కార్యక్రమాలను విజయవంతం గా అందిస్తున్నారని, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు శ్రీ తుమ్మల నాగేశ్వరరావు సారధ్యం ఖమ్మం నగరం అత్యంత అందమైన, ఆనందమైన ఖమ్మం గా మారుతుందని,ఖమ్మం అభివృద్ధి లో అలుపు లేకుండా తుమ్మల శ్రమిస్తున్నారని అభిప్రాయ పడ్డారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గా ప్రసాద్,ఖమ్మం అర్బన్ డిసిసి అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హనుమంతరావు, మాజీ మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం నగర కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మరియు మాజీ కార్పొరేటర్లు నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# వీధి దీపాల బిగింపు... పరిశీలించిన సర్పంచ్

## సర్పంచ్ పల్లె ప్రతిమ- పీవీరావు



రామగిరి, జూన్ 19(ది క్రైమ్ న్యూస్):- రామగిరి మండలం రత్నాపూర్ గ్రామ పంచాయతీ పరిధి రాంనగర్ లో వీధి దీపాలను శుక్రవారం బిగించారు. ఈ పనులను స్థానిక సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు పరిశీలించారు. 50 వాట్స్,150 వాట్స్ దీపాలను విద్యుత్ స్తంభాలకు అమర్చారు. మిగతా వాడలలో త్వరలో వీధి దీపాలను బిగిస్తామని సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు తెలిపారు. ఈ కార్యక్రమం లో వార్డు సభ్యులు అల్లి రమేష్, బత్తిని ప్రశాంత్, పున్నం మణి తేజ, కార్యదర్శి గంగుల సంతోష్, మాజీ వార్డు సభ్యుడు బొంగురాల రవి, ఎఎల్ఎం తిప్పిరిశెట్టి రమేష్, ఆపరేటర్లు కొండా శంకర్, కండె సంజీవ్, మెట్టు రవి, స్థానిక నాయకులు అమరగొండ శ్రీనివాస్, పీట్ల రవి, సింగ్లు పాల్గొన్నారు.

# విద్యా ప్రమాణాల పెంపులో రాష్ట్రంలో అగ్రగామిగా నిలిచిన పెద్దపల్లి జిల్లాకు రాష్ట్ర స్థాయి గుర్తింపు

## జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు విశిష్ట సన్మానం



పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : విద్యా ప్రమాణాల పెంపులో పెద్దపల్లి జిల్లాను రాష్ట్రంలో అగ్రగామిగా నిలిపినందుకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా విద్యాశాఖ అధికారులకు విశిష్ట గౌరవం లభించింది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్.బి. స్టేడియంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గౌరవ గవర్నర్ గారు, గౌరవ ముఖ్యమంత్రి గారి చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ను సన్మానించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. విద్యా రంగంలో నాణ్యతాభివృద్ధి, విద్యార్థుల అభ్యాస ఫలితాల మెరుగుదల, పాఠశాలల సమర్థ నిర్వహణలో పెద్దపల్లి జిల్లాను రాష్ట్రంలో ముందంజలో నిలిపినందుకు ఈ గుర్తింపు లభించింది. వేలాది మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది సమక్షంలో ఈ సత్కార కార్యక్రమం ఘనంగా జరిగింది. జిల్లా విద్యా వ్యవస్థ అభివృద్ధికి కృషి చేసిన జిల్లా విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యా రంగ భాగస్వాములు మరియు సిబ్బంది అందరికీ జిల్లా యంత్రాంగం అభినందనలు తెలియజేసింది. జిల్లా విద్యా రంగ అభివృద్ధికి అందరూ సమష్టిగా కృషి చేయడం వల్లే ఈ గౌరవం సాధ్యమైందని, భవిష్యత్తులో కూడా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు.

# బాధితులను కుటుంబ సభ్యులుగా భావించి సేవలందించాలి

## - పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి

## మహిళా పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన డీసీపీ

పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు,వార్షిక తనిఖీలలో భాగంగా పెద్దపల్లి జోన్ మహిళా పోలీస్ స్టేషన్‌ను పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మహిళా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న డీసీపీకి స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రమేష్ బాబు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం డీసీపీ పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించారు. ముఖ్యంగా రిసెప్షన్ కేంద్రాన్ని సందర్శించి అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో ఎలా వ్యవహరిస్తున్నారు, వారి సమస్యలను ఎలా స్వీకరిస్తున్నారు, ఫిర్యాదుల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులు పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారికి ఆత్మీయత కలిగేలా, కుటుంబ సభ్యులుగా భావించి మర్యాదపూర్వకంగా సేవలందించాలని సూచించారు. అనంతరం రిసెప్షన్ రికార్డులతో పాటు ఇతర స్టేషన్ రికార్డులను పరిశీలించి,వాటి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఫిర్యాదు నమోదు నుంచి చార్జ్‌షీట్ దాఖలు వరకు ప్రతి అంశాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. నిర్ణీత గడువులోగా దర్యాప్తు పూర్తి చేసి నిందితులను న్యాయస్థానం ముందు హాజరుపరచాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మహిళలకు సంబంధించిన కేసుల వివరాలను తెలుసుకుని,వాటి దర్యాప్తు పురోగతిని సమీక్షించారు. మహిళా బాధితులకు న్యాయం జరిగేలా కేసుల విచారణను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారి సమస్యలను ఓపికగా విని,ఇరు కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి సమస్యకు పరిష్కారం చూపుతామని భరోసా కల్పించాలని అన్నారు. మహిళా పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదయ్యే కుటుంబ కలహాలకు సంబంధించిన కేసులు,కౌన్సెలింగ్‌కు వచ్చే కేసులలో భార్యాభర్తల మధ్య విభేదాలు ఉన్నట్లయితే, విడిపోవడం వల్ల కలిగే అనర్థాలను వారికి వివరించాలని సూచించారు. సర్దుకుపోతేనే సంసారం సాఫీగా సాగుతుందని, చిన్న చిన్న సమస్యలకే తొందరపడి విడిపోవద్దని,కోర్టుల చుట్టూ తిరుగుతూ అన్ని విధాలా నష్టపోతున్న విషయాన్ని వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. భార్యాభర్తలిద్దరూ ఒకరినొకరు అర్థం చేసుకుంటే జీవితం సుఖమయంగా ఉంటుందని, కౌన్సెలింగ్ ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ తనిఖీలో పెద్దపల్లి ఏసీపీ జి.కృష్ణ యాదవ్, ఇన్‌స్పెక్టర్ రమేష్ బాబు,మహిళా ఎస్ఐ రాజమణి, సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

## జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ): ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించిందని, ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రతి రోగికి సత్వర మెరుగైన సేవలు అందేలా వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. పాలేరు నియోజకవర్గంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని క్యాజువాలిటీ, లేబర్ రూమ్, ఎమర్జెన్సీ వార్డ్, ఓపి రూమ్, ల్యాబ్, కాన్పుల అపరేషన్ థియేటర్, ప్రసుతి వార్డు, అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు, రోగులకు అందుతున్న సేవలు, మందుల నిల్వలు, సిబ్బంది హాజరు తదితర అంశాలను పరిశీలిస్తూ రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న సేవల వివరాలను ఆరా తీశారు. ఔషధ నిల్వల గదిని పరిశీలించి అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోగులకు అత్యవసర మందుల నిల్వలు, చికిత్స విధానంలో ఏలాంటి ఆలస్యం లేకుండా వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది సకాలంలో అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచి, రోగులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని అన్నారు. తిరుమలాయపాలెం ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు పెంచడానికి చర్యలు తీసుకోవాలని, ఆశా కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ గర్భిణీ మహిళలను ఎప్పటికప్పుడు ఫాలోఅప్ చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రులలో ఉన్న వసతులను వినియోగించుకుంటూ ప్రసవాల సంఖ్య పెంచాలని ఆ దిశగా వైద్య అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం తిరుమలాయపాలెం మండలం కేంద్రంలో నూతనంగా 26 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న 100 పడకల ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణాలకు ఉపయోగించే కాంక్రీట్, సిమెంట్, ఐరన్ ల నాణ్యత ను పర్యవేక్షించారు. హాస్పిటల్ లో గుర్తించిన ప్రాధాన్యత పనులు త్వరితగతిన నాణ్యతతో పూర్తి చేయాలని, జిల్లా యంత్రాంగం పనుల పూర్తిలో సహకారం అందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం వైద్య రంగ అభివృద్ధిని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని ముందుకు సాగుతున్నదని తెలిపారు. మండల, గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని అన్నారు. పనుల నాణ్యతపై ఎటువంటి రాజీ ఉండకూడదని, ప్రతి దశలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో ఆలస్యం లేకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన వనరులు సమకూర్చుకుని, నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. పెండింగ్ ఉన్న ఆస్పత్రి భవన నిర్మాణ పనులు, పూర్తి చేసి, కావలసిన వైద్య పరికరాలు, మౌళిక సదుపాయాలు ఏర్పంచుకొని ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్, మెడికల్ సూపరింటెండెంట్ డా. కృప ఉషశ్రీ, వైద్య శాఖ ఇఇ ఉమామహేశ్వరరావు, తిరుమలాయపాలెం మండల ఎంపిడివో సిలార్ సాహెబ్, తహసీల్దార్ విల్సన్, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి..

## - సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి



జమ్మికుంట జూన్ 19 (ది క్రైమ్ న్యూస్) : జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి నీ వంద పడకల ఆసుపత్రిగా రాష్ట్ర ప్రభుత్వం అప్ గ్రేడ్ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి నిల్కూరి వాసు రెడ్డి అన్నారు. ఈరోజు జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని జమ్మికుంట సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సందర్శించారు అనంతరం అక్కడ ఉన్న పేషంట్లతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ 300 పైచిలుకు కోడలుగా ఉన్నటువంటి జమ్మికుంట గా ఆస్పత్రి గ్రామాలకు కూడలిగా ఉన్నటువంటి జమ్మికుంట పట్టణంలో ఉన్న ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేసి అందుకు తగిన డాక్టర్లను సిబ్బందిని వైద్య పరికరాలను సమకూర్చాలని డిమాండ్ చేశారు. దశాబ్దాల కాలం నుండి 30 పడకల ఆసుపత్రిగా పరిమితం చేశారని రెండు నెలల క్రితం 50 పడకల ఆసుపత్రిగా అప్గ్రేడ్ చేస్తున్నట్టు ప్రకటించినప్పటికీ ఆచరణలో అడుగు ముందుకు పడలేదన్నారు. చిన్న చిన్న ప్రమాదాలు జరిగిన ఎక్రే సౌకర్యం లేకపోవడం వలన సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని దీనితో ఆర్థిక భారం పడుతుందన్నారు స్కానింగ్ సెంటర్ లేకపోవడం వలన స్థానిక ప్రైవేట్ స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు పేషంట్ల నుండి పెద్ద ఎత్తున దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. పేషెంట్లకు అన్ని రకాల టెస్టులు చేయాలని అన్నారు. డయాలసిస్ సెంటర్ ప్రకటించి సంవత్సరం అవుతున్న ఇప్పటివరకు అమలు కావడం లేదని దీనివలన డయాలసిస్ పేషెంట్లు హనుమకొండ కరీంనగర్ ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని రాష్ట్ర ప్రభుత్వం హడావిడిగా పేపర్ ప్రకటనలకే డయాలసిస్ కేంద్రం మంజూర అయిందని ప్రకటిస్తున్నారని ఆచరణలో మాత్రం అమలు కావడం లేదన్నారు. ఔట్సోర్సింగ్ కార్మికులందర్నీ వెంటనే పర్మినెంట్ చేయాలని కనీస వేతనం నెలకు 26 వేల రూపాయలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు హాస్పటల్లో సరిపడా డాక్టర్ లేకపోవడం వల్ల రోగులు ఇబ్బంది పడుతున్నారని వెంటనే ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులను మరియు స్టాప్ నర్స్ తో పాటు సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. డాక్టర్లు మరియు వైద్య సిబ్బంది దూర ప్రాంతాల నుండి కాకుండా జమ్మికుంట లోనే నివాసం ఉండే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమయపాలన పాటించని ఎల్డిసి, యూ డి సి ఫార్మసిస్టులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

# భూధార్ సర్వే , భూభారతి దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి..

**సాదా బైనామా, రీ-సర్వే ప్రక్రియలను గడువులోగా పూర్తి చేయాలి.**

**రెవెన్యూ సేవలను ప్రజలకు పారదర్శకంగా అందించాలి.**

**రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డిఎస్ లోకేష్ కుమార్**

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జూన్19(ది క్రైమ్ న్యూస్):-భూధార్ సర్వే, భూభారతి దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని, సాదాబైనామా, రీ-సర్వే ప్రక్రియలను గడువులోగా పూర్తి చేయాలని, రెవెన్యూ సేవలను ప్రజలకు పారదర్శకంగా



అందించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డిఎస్ లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డిఎస్ లోకేష్ కుమార్ పలు జిల్లాల కలెక్టర్లతో భూధార్ సర్వే, భూభారతి, సాదాబైనామా, నాన్-కడాస్ట్రల్ గ్రామాల రీ-సర్వే, నక్షా కార్యక్రమం, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న భూధార్ సర్వే కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని, ప్రతి భూ యజమానికి ఖచ్చితమైన భూ వివరాలు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే భూభారతి కార్యక్రమం కింద వచ్చిన దరఖాస్తులను ఎటువంటి జాప్యం లేకుండా , త్వరితగతిన పరిష్కరించాలని, ప్రజలకు రెవెన్యూ సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సాదాబైనామా దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేసి, అర్హులైన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని, భూములకు సంబంధించిన పెండింగ్ అంశాలను ప్రాధాన్యతగా తీసుకొని పూర్తి చేయాలని పేర్కొన్నారు. జిల్లాల్లో కొనసాగుతున్న నాన్-కడాస్ట్రల్ గ్రామాల రీ-సర్వే కార్యక్రమాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, ఎంపిక చేసిన గ్రామాల్లో నక్షా డిజిటల్ భూ మ్యాపింగ్ పనులను నాణ్యత ప్రమాణాలతో అమలు చేయాలని ఆదేశించారు. భూముల హద్దుల నిర్ధారణలో పారదర్శకత పాటిస్తూ భూ రికార్డుల ఆధునీకరణకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్, సంబంధిత రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రక్తదాన శిబిరం..



జమ్మికుంట జనవరి 19 (ది క్రైమ్ న్యూస్) : లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ గారి 56వ జన్మదినం సందర్భంగా యూత్ కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా కార్యదర్శి సజ్జాద్ మహమ్మద్ ఆధ్వర్యంలో పట్టణం లోని స్పందన బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని కరీంనగర్ డిసిసి ఉపాధ్యక్షులు మొలుగూరి సదయ్య, పొన్నగంటి మల్లయ్య, కొమ్మిడి రాకేష్ రెడ్డి, సాయి రవి, పిడుగు భాగ్యక్క, శ్రీపతి రెడ్డి లు కలిసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సజ్జాద్ మహమ్మద్ మాట్లాడుతూ, రాహుల్ గాంధీ దేశ యువతకు స్ఫూర్తిగా నిలుస్తూ సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య పరిరక్షణ, పేద మరియు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ఆయన జన్మదినాన్ని సేవా కార్యక్రమాల ద్వారా జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. రక్తదానం చేయడం ద్వారా అనేక మంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని, యువత సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి ఇటువంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ శిబిరంలో సేకరించిన రక్తం అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ పర్లపల్లి విజయ్, కౌన్సిలర్లు యట్ల సునీత అశోక్, శ్రీపతి స్వర్ణలత నరేష్ , చందరాజు, మాచర్ల రాజు, ఒగ్గు రమేష్, ఏగీత సుజాత అశోక్, దిడ్డి రాము, కూతాటి తిరుపతి, నాయకులు, యూత్ కాంగ్రెస్ పింగిలి చైతన్య రమేష్, దొడ్డే సంధ్య నవీన్, పార్లపల్లి నాగరాజు, ధర్ముల శ్రీకాంత్ , గాలిబు నవీన్, రోమాల రాజ్ కుమార్, బుడిగె శ్రీకాంత్, రాచపల్లి సాగర్ , సిద్దు, ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, పెన్సిల్ కిట్ల పంపిణీ



క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం హఫీజ్‌పేట్ ప్రభుత్వ పాఠశాలలో కాంగ్రెస్ నాయకుడు గౌతమ్ గౌడ్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో కేక్ కట్ చేసి విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం గౌతమ్ గౌడ్ చేతుల మీదుగా విద్యార్థి, విద్యార్థినులకు ఉచితంగా పుస్తకాలు, పెన్సిల్ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో విద్యాపట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు, సమాజ సేవ పట్ల కాంగ్రెస్ పార్టీ నిబద్ధతను చాటిచెప్పారు. ఈ సందర్భంగా గౌతమ్ గౌడ్ మాట్లాడుతూ దేశ ప్రజల సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు దేశవ్యాప్తంగా పర్యటిస్తూ, వారి గొంతుకగా నిలుస్తున్న నాయకుడిగా ఆయనను అభివర్ణించారు. రాహుల్ గాంధీ నాయకత్వం దేశ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేయగలదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు జమీర్ (లిమ్రా), జ్ఞానేశ్వర్, వీరేందర్, గోపి, సుధీష్, జహీర్, రాము, ఇమ్రాన్, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి.

## -గ్రామ సర్పంచ్ జంగిలి పోచాలు

రామగిరి,జూన్ 19(ది క్రైమ్ న్యూస్):- గుండారం గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరం భాగస్వాములు కావాలి అని గ్రామ సర్పంచ్ జంగిలి పోచాలు అన్నారు. శుక్రవారంకమాన్ పూర్ మండలం గుండారం గ్రామ ప్రత్యేక సమావేశం సర్పంచ్ జంగిలి పోచాలు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఇటీవలే గ్రామ అభివృద్ధికి ఐదు లక్షల రూపాయలు ఉపాధి హామీ పథకం కింద మంజూరయ్యాయని అట్టి 5 లక్షల రూపాయలను రోడ్డు వేసేందుకు తీర్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో మిగిలిపోయిన పనులను ఈ పాలకవర్గం చేసే బాధ్యత మనపై ఉందని అన్నారు. ఈ సమాజంలో ఉప సర్పంచ్ అంబి రాజేందర్ , పంచాయతీ కార్యదర్శి బి ప్రసాద్, వార్డ్ మెంబర్లు బొడ్డు రవీందర్, గాదె లత , పిడుగు కవిత , వడ్లకొండ వసంత, గరిగంటి పద్మ, పిడుగు దామెర దేవయ్య ,గరిగంటి కృష్ణ స్వామి , గ్రామ కార్యదర్శి బచ్చల ప్రసాద్, కారోబార్ రాచకొండ భీమరాజు తదితరులు పాల్గొన్నారు.





# బాలకృష్ణ మూవీలో కాజల్ అగర్వాల్

## ఫస్ట్ లుక్ విడుదల చేసిన మూవీ మేకర్స్

నందమూరి బాలకృష్ణ, మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ఎన్‌బికె111' నుంచి మేకర్స్ బిగ్ సర్‌ప్రైజ్ ఇచ్చారు. శుక్రవారం హీరోయిన్ కాజల్ అగర్వాల్ పుట్టినరోజు సందర్భంగా ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తూ చిత్రంలో కాజల్ హీరోయిన్‌గా నటిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. దీంతో గత కొన్ని వారాలుగా ఈ ప్రాజెక్ట్‌పై నెలకొన్న ఊహాగానాలకు ఫుల్‌స్టాప్ పడింది. తాజాగా విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో కాజల్ సింపుల్ చీరకట్టులో, కళ్లజోడు ధరించి అత్యంత గంభీరంగా కనిపించింది. కార్యాలయ వాతావరణంలో నిలబడి ఉన్న ఆమె లుక్‌లో సీరియస్‌నెస్, పవర్‌ఫుల్ వైబ్ స్పష్టంగా కనిపిస్తోంది. స్టార్ హీరోయిన్‌ను ఇలా డీ-గ్లామర్ లుక్‌లో చూపించడంతో పాత్రపై క్యూరియాసిటీ ఒక్కసారిగా పెరిగింది. పోస్టర్‌తో పాటు చిత్ర బృందం కాజల్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ, ఈ సినిమా ఆమె కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందని పేర్కొంది. 'భగవంత్ కేసరి' తర్వాత బాలకృష్ణ, కాజల్ కాంబినేషన్‌లో వస్తున్న రెండో చిత్రమిది. 'భగవంత్ కేసరి'లో కాజల్ పాత్రకు మంచి పేరు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే 'ఎన్‌బికె111'లో మాత్రం ఆమె పూర్తి స్థాయి కథానాయికగా, కథను మలుపు తిప్పే కీలక పాత్రలో కనిపించనుందని ఫిల్మ్ నగర్ వర్గాలు చెబుతున్నాయి. యాక్షన్, ఎమోషన్‌ల మేళవింపుగా భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్ర షూటింగ్ ఇప్పటికే శరవేగంగా జరుగుతోంది.





# సుమంత్ హీరోగా మహేంద్రగిరి వారాహి

అక్కినేని కంపౌండ్ నుంచి సుమంత్ హీరోగా, ఆధ్యాత్మిక అంశాల నేపథ్యంలో విలక్షణమైన చిత్రాలను తెరకెక్కించే దర్శకుడు సంతోష్ జాగర్లపూడి కాంబినేషన్‌లో వస్తున్న సరికొత్త చిత్రం 'మహేంద్రగిరి వారాహి'. భక్తి, పురాతన నమ్మకాలు, సైన్స్ అండ్ మిస్టరీ చుట్టూ తిరిగే ఈ ఆధ్యాత్మిక సస్పెన్స్ థ్రిల్లర్ అఫీషియల్ టీజర్ విడుదలైన క్రమంలో సోషల్ మీడియాను ఊపేస్తూ, సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. మహేంద్రగిరి కొండల బ్యాక్‌డ్రాప్‌లో, వరాహి మాత దివ్య శక్తి చుట్టూ అల్లిన కథతో ఈ సినిమా రూపొందుతోంది. తాజాగా విడుదలైన టీజర్ ఆడియన్స్‌ను సరికొత్త లోకంలోకి తీసుకెళ్లింది. అక్కడ జరిగే కొన్ని అంతుచిక్కని సంఘటనలు, భూగర్భంలో దాగి ఉన్న రహస్యాలు, ప్రకృతి సృష్టించే వింతలు ఈ టీజర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ప్రతి ఫ్రేమ్‌లోనూ ఒక తెలియని గంభీరమైన వాతావరణాన్ని, హారర్ ఎలిమెంట్స్‌ని దర్శకుడు పర్‌ఫెక్ట్‌గా ఎలివేట్ చేశారు. విజువల్స్ చాలా గ్రాండ్‌గా ఉండటమే కాకుండా, సినిమా కథలో ఏదో ఒక పెద్ద రహస్యమే దాగి ఉందనే క్యూరియాసిటీని ప్రేక్షకుల్లో బలంగా నాటాయి. ఈ సినిమాకు ప్రముఖ సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ టీజర్‌కు ప్రాణంగా నిలిచింది. ఆధ్యాత్మిక శ్లోకాలతో పాటు, థ్రిల్లింగ్ సీన్లను నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్లేలా ఆయన మ్యూజిక్ అందించారు. ప్రతాప్ ఆర్. కృష్ణ సినిమాటోగ్రఫీ మైండ్ బ్లోయింగ్ అనిపించేలా ఉంది. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు అన్నపూర్ణ స్టూడియోస్ లో శరవేగంగా జరుగుతున్నాయి. రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు బ్రిడ్జ్ ఫిల్మ్స్ బ్యానర్లపై కలిపు మధు, లక్ష్మణ్ సంయుక్తంగా ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో సుమంత్ సరసన మీనాక్షి గోస్వామి హీరోయిన్‌గా నటిస్తుండగా, మాళవిక నాయర్, హాస్యబ్రహ్మ బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, రాజీవ్ కనకాల, అలీ లాంటి భారీ తారాగణం కీలక పాత్రలు పోషిస్తున్నారు.


# పవర్‌ఫుల్ రోల్‌లో సమంత

## లేడీ ఓరియంటెడ్ మూవీ..మాఇంటి బంగారం





మూడేళ్ల విరామం తర్వాత సమంత చేసిన సినిమా 'మా ఇంటి బంగారం'. దాంతో ఈ సినిమాపై అంచనాలు మొదట్నుంచీ భారీగానే ఉన్నాయి. పైగా 'ఓ బేబీ' తర్వాత నందినీరెడ్డి, సమంత కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో సినిమాపై ఆసక్తి జనాల్లో మెండుగానే ఉన్నది. ఈ సినిమాలో సమంత తొలిసారి యాక్షన్ రోల్ పోషించారు. ప్రచార చిత్రాలకూ, పాటలకు కూడా మంచి స్పందన రావడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రేమ వివాహం చేసుకొని, ఓ సంప్రదాయ కుటుంబంలోకి పెద్ద కోడలుగా ఎంట్రీ ఇస్తుంది స్వర్ణ(సమంత). ఇంట్లోకి వచ్చిన నాటి నుంచి అప్పటికే ఇంట్లో ఉన్న చిన్నకోడలు అనసూయ(శ్రీముఖి)తో పోలుస్తూ అంతా ఆమెను చూస్తుంటారు. అనసూయ ఇంటిని చక్కదిద్దటంలో దిట్ట. కానీ స్వర్ణకు మాత్రం ఆ ఇంటి విషయాలు ఏమీ తెలియవు. కానీ ఎలాగైనా పెద్ద కోడలుగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెడుతుంది. దీనికి తన చిన్ననాటి స్నేహితురాలు ఆమెకు సహాయం చేస్తుంటుంది. ఈ విధంగా సరదాగా కథ సాగుతూవుంటుంది. మరోవైపు నక్సలైట్ ముసుగులో దుర్మార్గాలకు తెగబడే నీచుడైన గుల్షన్ దేవయ్య జైల్లో శిక్ష అనుభవిస్తుంటాడు. తనకు అనుచరుడి ద్వారా తన సహ నక్సలైట్ అయిన ఝాన్సీ ఆచూకీ తెలుస్తుంది. ఆ ఝాన్సీనే స్వర్ణగా పేరు మార్చుకొని బతుకుతున్నదని తెలుసుకున్న గుల్షన్ దేవయ్య, ఎలాగైనా ఝాన్సీని దక్కించుకునేందుకు జైలు నుంచి పారిపోయి వస్తాడు. ఝాన్సీ వేరే వ్యక్తిని పెళ్లాడిందని తెలుసుకొని రగిలిపోతాడు. ఎలాగైనా ఝాన్సీని, ఆమె కుటుంబాన్నీ నాశనం చేయాలనుకుంటాడు. మరి స్వర్ణ రూపంలో ఉన్న ఝాన్సీ తన కుటుంబాన్ని ఎలా కాపాడుకున్నది? అసలు స్వర్ణలా ఝాన్సీ ఎందుకు మారింది? ఈ స్వర్ణ ఎవరు? ఆమె కథేంటి? ఈ ప్రశ్నలకు సమాధానమే మిగతా కథ.

కొంచెం రొటీన్ కథే అయినా 'మా ఇంటి బంగారం' విషయంలో కొత్తగా కనిపించిన విషయం ఏంటంటే.. ఇది లేడీ ఓరియెంటెడ్ స్జబెక్ట్ కావడమే. ఈ తరహా కథ ఓ హీరోయిన్ చేయడం మాత్రం కొత్తగా ఉన్నది. ఫస్టాఫ్ సినిమా చూస్తున్నంతసేపూ మహేశ్‌బాబు 'అతడు' సినిమా గుర్తొస్తుంది. అందులో మహేశ్ కిరాయి హంతకుడు. ఇందులో సమంత నక్సలైట్. అంతే తేడా. కథ పాతదైనా దాన్ని కొత్తగా చెబితే సినిమా హిట్టే. ఈ విషయంలో దర్శకురాలు నందినిరెడ్డి సక్సెస్ అయ్యిందనే చెప్పాలి. ప్రథమార్థంతో సమంతను కుటుంబ స్త్రీగా చూపించిన తీరు, అక్కడ్నుంచీ నిదానంగా ఆమె ట్రాన్స్‌ఫర్మేషన్.. సమంతతో చేయించిన పోరాటాలు, ఈ నేపథ్యంలో వచ్చే ఉత్కంఠభరితమైన సన్నివేశాలు మాస్ ఆడియన్స్‌కి బాగా పట్టేస్తాయి. ఫస్టహాఫ్‌లో ఇంట్లో జరిగే కామెడీ సన్నివేశాలు, కారు ఛేజింగ్ సీక్వెన్స్ చాలా బావున్నాయి. ఇక సెకండాఫ్‌లో కథ కాస్త స్లో అయినట్టు అనిపిస్తుంది. తనెవరో తన ఇంట్లో అందరికీ రివీల్ చేసే క్రమంలో కాస్త కథ నిదానించిన ఫీలింగ్ కలుగుతుంది. హీరోలకు ఏ మాత్రం తీసిపోకుండా అద్భుతమైన పోరాటలు చేసి శభాష్ అనిపించుకున్నది సమంత. ఈ సినిమాలో ఝాన్సీగా, స్వర్ణగా రెండు షేడ్స్‌ని అద్భుతంగా పోషించింది. తనదైన శైలిలో కామెడీ కూడా పండించింది. 'స్త్రీ అంటే ఇలా ఉండాలి..' అనిపించేలా ఆమె పాత్ర సాగింది. సమంత తర్వాత ఈ సినిమాలో చెప్పుకోవాల్సిన పాత్ర గుల్షన్ దేవయ్యదే. తన విలనీ అదిరిపోయింది. చెడ్డ లక్షణాలున్న నక్సలైట్ నాయకుడిగా తను ఒదిగిపోయి అభినయించాడు. ఇక మిగతా వారంతా కూడా పరిధిమేర తమ పాత్రలను రక్తికట్టించారు. రాజ్ నిడిమోరు పాత కథే రాసినా.. డైరెక్టర్ నందినీరెడ్డి కొత్త ట్రీట్ చేసి, జనరంజకంగా సినిమాను తెరకెక్కించింది. సెకండాఫ్ విషయంలో కాస్తంత శ్రద్ధ పెడితే బావుండేది. సంతోష్ నారాయణ సంగీతం సినిమాకు పెద్ద ఎస్సెట్. నేపథ్య సంగీతం బావుంది. ఓం ప్రకాశ్ కెమెరా పనితనం అభినందనీయంగా ఉంది. మొత్తంగా లేడీ ప్రేక్షకులు, సమంత అభిమానులు గర్వపడేలా, మాస్ ప్రేక్షకులకు నచ్చేలా, ఫ్యామిలీ ఆడియన్స్ మెచ్చేలా సినిమా ఉన్నదని చెప్పొచ్చు.



# తెలంగాణ ఫోక్ సింగర్ నాగదుర్గకు హీరోయిన్ ఛాన్స్

'కాపోళ్ల ఇంటికాడా', 'పేరుగల్ల పెద్దిరెడ్డి', 'దారి పొంటొతుండు' వంటి విలక్షణమైన జానపద గీతాలతో, తన అద్భుతమైన నృత్యంతో యూట్యూబ్‌లో మిలియన్ల కొద్దీ వ్యూస్ సొంతం చేసుకున్న ప్రముఖ ఫోక్ సింగర్, డాన్సర్ నాగదుర్గ టాలీవుడ్‌లో బంపర్ ఆఫర్ కొట్టేసింది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై తన మార్కు జానపద నృత్యాలతో సెన్సేషన్ సృష్టించిన ఈ తెలంగాణ జానపద కళాకారిణి, ఇప్పుడు ఏకంగా సిల్వర్ స్క్రీన్ పై హీరోయిన్‌గా అదృష్టాన్ని పరీక్షించుకోబోతోంది. ప్రముఖ క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కి చెందిన 'సుకుమార్ రైటింగ్స్' మరియు సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్ బన్నీ వాస్ కి చెందిన 'బన్నీ వాస్ ప్రొడక్షన్స్' సంయుక్తంగా నిర్మిస్తున్న ఒక క్రేజీ ప్రాజెక్టులో నాగదుర్గకు హీరోయిన్‌గా లక్కీ ఛాన్స్ దక్కింది. ఈ సినిమాలో హీరోగా వైవిధ్యమైన పాత్రలతో టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రియదర్శి నటించబోతున్నాడు. ఈ సినిమాతో వంశీ రెడ్డి దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఇప్పటికే 'కలివి వనం' అనే ఓ విలక్షణమైన చిత్రంలో నటించిన నాగదుర్గ, ఆ తర్వాత తమిళంలోనూ ఓ క్రేజీ ప్రాజెక్ట్ లో నటించింది. ఇప్పుడు టాలీవుడ్ లోని మోస్ట్ సక్సెస్‌ఫుల్ బ్యానర్ల నిర్మాణంలో, ప్రియదర్శి సరసన లీడ్ రోల్ పొంది ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. నాగదుర్గ పల్లెటూరి నైపథ్యం, ఆమె సహజ సిద్ధమైన నటన, హావభావాలు ఈ చిత్రానికి ప్రధాన బలం కానున్నాయని తెలుస్తోంది.తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా తెరకెక్కబోతున్నట్లు సమాచారం.





# ధనుష్ తాజా చిత్రం ఓం

తమిళ స్టార్ నటుడు ధనుష్ 55వ చిత్రానికి సంబంధించిన క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. డి 55గా తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియా చిత్రానికి 'ఓం అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఫిక్స్ చేస్తూ, మేకర్స్ అదిరిపోయే గ్లింప్స్‌ను విడుదల చేశారు. దట్టమైన అడవులు, కొండల నడుమ సాగే ఇంటెన్స్ యాక్షన్ డ్రామాగా ఈ గ్లింప్స్ కట్ చేశారు. అమాయక గిరిజనులను సాయుధ బలగాలు చుట్టుముట్టగా, భయంతో ఉన్న వారంతా ఒక్కసారిగా 'అణ్ణా మలైయార్‌కు!' అని నినదించే సీన్ ఒళ్లు గగుర్పొడిచేలా ఉంది. ఆ వెంటనే వర్షం, పొగమంచు మధ్య చేతిలో తుపాకితో ధనుష్ వయలెంట్ అవతారంలో ఎంట్రీ ఇస్తాడు. తుపాకులు పట్టుకున్న బలగాలతో ఒంటిచేత్తో తలపడే యాక్షన్ సీక్వెన్స్‌లు సినిమాపై అంచనాలను ఆకాశానికి చేర్చాయి. ఈ చిత్రాన్ని మేకర్స్ మల్టీ-పార్ట్ సిరీస్‌గా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. 'అమరన్' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వస్తున్న ప్రాజెక్ట్ కావడంతో 'ఓం'పై భారీ హైప్ నెలకొంది. ఈ చిత్రంలో ధనుష్‌తో పాటు మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి, టాలెంటెడ్ హీరోయిన్ సాయి పల్లవి, యంగ్ సెన్సేషన్ శ్రీలీల కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అయితే ఫస్ట్ స్ట్రయిక్‌లో కేవలం ధనుష్ యాక్షన్ పోర్షన్ మాత్రమే చూపించి, మమ్ముట్టి, సాయి పల్లవి లుక్స్‌ను సస్పెన్స్‌గా ఉంచారు. సాయి పల్లవి ఈ చిత్రంలో పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనుందని టాక్. యంగ్ మ్యూజిక్ సెన్సేషన్ సాయి అభ్యంకర్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ గ్లింప్స్‌కు ప్రాణం పోసింది. వండర్‌బార్ ఫిలింస్, ఆర్‌టేక్ స్టూడియోస్ సంయుక్తంగా భారీ బ్జడెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor,
MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published
at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell :
7989575563, Mail:thecrimenews123@gmail.com